PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 49 | విజయవాడ, శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 19 September 2025 | Rs

కదంతొక్కిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు

- ఎపి ఆటో, క్యాబ్, టాటా ఏస్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల ఐక్యవేదిక మహాధర్నా

3



కుర్రాళ్లకు సదవకాశం

- నేడు ఒమన్‌తో టీమిండియా ఢీ
- రేపటినుంచి సూపర్-4 మ్యాచ్‌లు


8

సామాన్యులకు 'జిఎస్‌టి' ఫలాలు

- నెలరోజుల పాటు విస్తృత ప్రచారం
- రాష్ట్ర ఖజానాకు రూ.8 వేల కోట్ల నష్టం
- మోడీ, చంద్రబాబులను అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో రెండో దశ జిఎస్‌టి సంస్కరణల ఫలాలు సామాన్యులకు అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జిఎస్‌టి సంస్కరణలపై గురువారం శాసనసభలో జరిగిన చర్చ ముగింపులో ఆయన మాట్లాడుతూ దీనిపై నెలరోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకువచ్చిన జిఎస్‌టి సంస్కరణలను స్వాగతిస్తూ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సంస్కరణల వల్ల రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గుతున్నా రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా సమర్థించినందుకు చంద్రబాబు నాయుడ్ని అభినందిస్తూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని కూడా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకుముందు చంద్రబాబు మాట్లాడుతూ జిఎస్‌టి సంస్కరణల ప్రయోజనాలను క్షేత్రస్థాయి వరకూ విస్తత ప్రచారం చేసేలా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆదాయం తగ్గుతున్నా ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయాన్ని దేశంలో మొట్టమొదట గానే స్వాగతించినట్లు చెప్పారు. ఈ సంస్కరణ ఓ ముందడుగని దీని ద్వారా ప్రజలకు ప్రయోజనాలు కల్పించటంతో పాటు వ్యాపారులకూ ఉపశమనం కలిగిస్తుందన్నారు.. చరిత్రలో జరిగే మంచి అంశాల్ని కొన్ని రాజకీయ పార్టీలు అర్థం చేసుకోలేవు, సహకరించవని ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్ష హెూదా అడుగుతున్న పార్టీది అదే పరిస్థితి. ఈ సంస్కరణల్ని స్వాగతించలేని పరిస్థితుల్లో ఆ పార్టీ ఉంది' అని వైసిపినుద్దేశించి ఆయన అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజాస్వామ్యంలో బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజల పక్షాన పనిచేయాలన్నారు. మోడీ తెచ్చిన సంస్కరణలపై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా వైసిపి వారు లేకపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. సంస్కరణలకు తాను ఎప్పుడూ ముందుంటానని అభివృద్ధి జరిగితే సంపద వస్తుందన్నారు. సంపద సృష్టిస్తే ప్రభుత్వానికి ఆదాయం మిగతా 7లో



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సాయంత్రం వరకు అసెంబ్లీ

మంత్రులు, ఎమ్మెల్యేలందరు సభలో ఉండాలి : సిఎం

శాసన సభ సమావేశాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. జిఎస్‌టిపై జరిగిన చర్చలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు.అసెంబ్లీ జరుగు తున్న సమయంలో మంత్రులు, ఎంఎల్‌ఏలు, అధికారులు అందరూ సభలోనే ఉండాలని ఆయన చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు భోజన విరామం ఉంటుందని ఉదయం 3 గంటలు, భోజనం తరువాత మూడు గంటలు సభ ఉంటుందన్నారు.కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు ఎక్కువ సమయం అసెంబ్లీలో గడపాల న్నారు. అంతకుముందు బిఎసి సమావేశంలో కూడా ఆయన ఇదే మాదిరి వ్యాఖ్యలు చేశారు.

మండలిలో నిరసనలు

- రైతాంగ సమస్యలపై వాయిదా తీర్మానం తిరస్కరణ
- ఉపాధ్యాయుల సమస్యలపై పిడిఎఫ్ ప్రత్యేక ప్రస్తావన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో శాసనమండలి పలుసార్లు వాయిదా పడింది. రైతాంగ సమస్యలపై చర్చించాలని ఇచ్చిన వాయిదా తీర్మానంపై ఒకసారి వాయిదా పడగా, తిరుమల, సింహాచల తొక్కిసలాట ఘటనలపై మరోసారి వాయిదా పడింది. తొక్కిసలాట ఘటనపైనే మండలి నుంచి వైసిపి వాకౌట్ చేసింది. రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని కోరుతూ శాసనమండలిలో వైసిపి వాయిదా తీర్మానం గురువారం అందించింది. సమావేశం మొదలు కాగానే ఈ అంశంపై చర్చకు పట్టుబడుతూ ఆ పార్టీ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, వై శివరామిరెడ్డి, పి రామసుబ్బారెడ్డి చైర్మన్ కె మోషేన్ రాజుకు వాయిదా తీర్మానం అందించారు. ఈ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించగానే చర్చించాలని వైసిపి సభ్యులంతా పట్టుబట్టారు. మరోవైపు ఉపాధ్యాయుల సమస్యలను ప్రత్యేక ప్రస్తావన (స్పెషల్ మెన్షన్) ద్వారా పిడిఎఫ్ సభ ముందుకు తీసుకువచ్చింది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను మినహాయించాలని పిడిఎఫ్ సభ్యులు గోపిమూర్తి ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ పథకాల నిర్వహణ కోసం ఉపాధ్యాయులను విస్తృతంగా వినియోగిస్తున్నారని ఆక్షేపించారు. పాఠశాలల్లో యాప్‌ల భారం నుంచి తగ్గిస్తామని చెప్పి ఒకే యాప్‌లో అనేక అంశాలు చేర్చి వాటిని పూర్తిచేయమనడం తగదన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా ప్రశ్నోత్తరాలను బుక్‌లెట్ రూపంలో ఇవ్వడం వల్ల మూల్యాంకనంలో ఉపాధ్యాయులకు ఎక్కువ సమయం పడుతోందని చెప్పారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయం లో యూరియా కొరతపై వైసిపి సభ్యుల నినాదాల మధ్య వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బిఎసి సమావేశంలో చర్చించి యూరియా, వ్యవసాయ ఉత్పత్తులపై మిగతా 7లో

27 వరకు అసెంబ్లీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 27వ తేది వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఎంఎల్‌ఏలకు ప్రభుత్వ విప్‌ల నుండి గురు వారం సాయంత్రం సమాచారం అందింది. అంతకుముందు శాసనసభ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బిఎసి)లో శాసనసభ సమావేశాలను 30 వరకు (10 పనిదినాలు) నిర్వహించాలని నిర్ణయించారు. పలువురు ఎంఎల్‌ఏలు దసరా పండుగ నేపథ్యంలో సభ పనిదినాలను తగ్గించాలని కోరారు. చివరకు ఎనిమిదిరోజులకు (27వరకు) కుదించాలని నిర్ణయించారు. అంతకుముందు స్పీకర్ వద్ద జరిగిన సమావేశంలో 18 అంశాలను టిడిపి, 9 అంశాలను బిజెపి ప్రస్తావించింది. జలవనరులు, శాంతిభద్రతలు, వైద్య ఆరోగ్యం,పరిశ్రమలు, సూపర్ సిక్స్, క్వాంటమ్ వ్యాలీ,లాజిస్టిక్స్, స్వర్ణాంధ్ర రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధిపై ఈ సమావేశాల్లో చర్చించాలని నిర్ణయించారు.



ఇజ్రాయిల్ భూతల దాడులను ముమ్మరం చేస్తూ చొచ్చుకొస్తుండటంతో ఉత్తర గాజా ప్రాంతాన్ని వీడి దక్షిణం వైపు బతుకు జీవుడా అంటూ వలస వెళ్తున్న ప్రజలు

7

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ

- భూతలదాడులతో భయోత్పాతం
- యుద్ధట్యాంకులను మోహరించిన సైన్యం

పార్లమెంట్ ఇ-మెయిల్ వ్యవస్థ ప్రయివేటుపరం

- బ్యాకెండ్ నిర్వహణ ఔట్‌సోర్స్‌కు అప్పగింత
- సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ ఆందోళన
- రాజ్యసభ చైర్మన్‌కు లేఖ



న్యూఢిల్లీ : దేశ శాసన వ్యవస్థలో విశ్వసనీయత, సమాచార గోప్యతకు రాజ్యాంగ నిర్మాతలు అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ప్రజలకు అవసరమైన మేరకు మినహా తన దృష్టికి వచ్చిన సమాచారాన్ని గోప్యతగా ఉంచుతానని ప్రజాప్రతినిధులు ప్రమాణం కూడా చేస్తారు. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు శాసన వ్యవస్థ గోప్యతకే గంపగుత్తగా తిలోధకాలు ఇచ్చేసింది. పార్లమెంటకు సంబంధించిన ఇ-మెయిల్ వ్యవస్థను ప్రయివేటుపరం చేయాలని నిర్ణయించింది. ఇ-మెయిల్ బ్యాకెండ్ కార్యాకలాపాల నిర్వహణను ఔట్ సోర్సింగ్ సంస్థకు కట్టబెట్టింది. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సిపిఎం నేత, రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ ఇదే ఆందోళన వ్యక్తం చేస్తూ రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్‌కు ఒక లేఖ రాశారు. సామాజిక మాధ్యమాల్లో ఆ లేఖను పోస్టు చేశారు. ప్రయివేటుకు అప్పగించడం వల్ల పార్లమెంట్ సభ్యులు తమ అధికారిక ఇ-మెయిల్ ఖాతాల నుండి పంపే కమ్యూనికేషన్ల గోప్యత, విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదముందని బ్రిట్టాస్ ఆందోళన వ్యక్తం చేశారు. శాసన వ్యవస్థ స్వయంప్రతిపత్తిని, పార్లమెంటరీ సార్వభౌమాధికార పునాదులను ఇలాంటి చర్యలు దెబ్బతీస్తాయని తెలిపారు. పార్లమెంటరీ కమ్యూనికేషన్లను ఇప్పటివరకు పూర్తిగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసి) నిర్వహిస్తోంది. ఇప్పుడు ఇ-మెయిల్ వ్యవస్థ బ్యాకెండ్ ఆపరేషన్ల బాధ్యతలను జోమో కార్పొరేషన్ అనే ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించినట్లు బ్రిట్టాస్ పేర్కొన్నారు. దాదాపు 50 లక్షల ప్రభుత్వ ఇ-మెయిళ్ల ఐడిలకు మిగతా 7లో

విద్యార్థులపై విరిగిన లాఠీ

- ఆదోనిలో 'చలో మెడికల్ కళాశాల' ఉద్రిక్తత
- పది మందిపై కేసు నమోదు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ ఖండన

ప్రజాశక్తి - ఆదోనిరూరల్/ఆదోని

కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేయరాదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో మెడికల్ కళాశాల' ఉద్రిక్తతకు దారితీసింది. ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్దకు సుమారు 200 మంది విద్యార్థులు, విద్యార్థి నాయకులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి కార్యకర్తలను పంపినప్పుడు తమను ఎందుకు అడ్డుకుంటున్నారని విద్యార్థి నాయకులు ప్రశ్నించారు. పోలీసుల తీరును నిరసిస్తూ విద్యార్థులు రహదారిపై బైఠాయించారు. ఒక్కసారిగా విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాసులును కాళ్లతో తన్ని, పిడుగులు గుద్దుతూ పోలీసు వాహనం ఎక్కించారు. జిల్లా అధ్యక్షులు సాయి ఛాతిపై పిడిగుద్దులు గుద్దడంతో సొమ్మసిల్లి పడిపోయారు. పలువురు విద్యార్థి నాయకులను రోడ్డుపై నుంచి ఈడ్చుకుంటూ వచ్చారు. వీరందరిని ఆదోని తాలుకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. లాఠీఛార్జీలో గాయాలపాలైన నాయకులకు కనీసం ప్రాథమిక వైద్యం కూడా చేయించకుండా పది మంది విద్యార్థులను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు స్టేషన్‌కు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. కడపునొప్పితో బాధపడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసును ఆస్పత్రికి తీసుకువెళ్తామని అడిగిన సిపిఎం నాయకులపై ఎస్ఐ రామాంజనేయులు పరుషంగా ప్రవర్తించారు. 'ఎప్పుడు ఆస్పత్రికి తీసుకువెళ్లాలో మాకు తెలుసు...ఇప్పుడు అవసరం లేదంటూ' దురుసుగా మాట్లాడారు. శాంతియుత నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జీ చేయడం మిగతా 7లో



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్పను బలవంతంగా ఈడ్చుకు వెళ్తున్న పోలీసులు

ఎన్‌సిసి ఎంపికలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్



ఎన్‌సిసి పరుగు పందెంలో పాల్గొన్న ఇంజనీ రింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన విజయనగరంలో చోటు చేసుకుంది. తోటి విద్యార్థులు, మృతుని తల్లిదండ్రుల కథనం మేరకు... పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన సాయి కిరణ్ (19) విజయనగరంలోని సీతం కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఎన్‌సిసి చేయాలనే ఆసక్తితో గురువారం కళాశాలలో నిర్వహించిన ఎంపికలో పాల్గొన్నారు. అందులో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. పరిగెడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కళాశాల యాజ మాన్యం, ఎన్‌సిసి సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయికిరణ్ మృతి చెందారు. తమకు న్యాయం చేయాలంటూ జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద సాయికిరణ్ తల్లి దండ్రులు, విద్యార్థులు నిరసన తెలిపారు. ఎన్‌సిసి ఎంపిక సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సాఫ్ట్‌వేర్‌తో ఓటర్ల పేర్లు తొలగింపు

ప్రజాస్వామ్యంపై పడిన అణుబాంబు

- ఓట్ల చోరీపై వంద శాతం ఆధారాలున్నాయి
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోన్న ఎన్నికల సంఘం
- విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ
- ఆన్‌లైన్ వేదికగా ఓట్ల తొలగింపు అసాధ్యం : ఇసి

ప్రజాశక్తి న్యూఢిల్లీ బ్యూరో

ఓటు చోరీ అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెనక్కి తగ్గటం లేదు. ఓటర్ల పేర్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై పడిన అణుబాంబు అని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం(ఇసి) ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. అంతేకాదు.. ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించబడిన వ్యక్తులను ఆయన మీడియా ముందుకు తీసుకొచ్చారు. గురువారంనాడిక్కడ ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లా డారు. ఇది కేవలం ఓట్ల జాబితా సమస్య కాదనీ, లక్షలాది మంది ఓటర్ల హక్కులపై జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియలో తేడాలు, అక్రమాలు సరిచేయాల్సిన సమయం వచ్చిందనీ, ఈ చీకటి రాజకీయం గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

వివిధ రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపు

కర్నాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హర్యానా, బీహార్‌ల్లో ఓట్ల తొలగించారని ఆయన అన్నారు. ఒక్క కర్నాటక లోని ఆలంద్ నియోజకవర్గంలో 6,018 ఓట్లను నకిలీ లాగిన్, ఫోన్ నెంబర్లను ఉపయోగించి తొలగించారని తెలిపారు. 14 నిమిషాల్లో 12 మంది ఓటర్లను తొలగించారని ఆరోపించిన సూర్యకంత్ అనే వ్యక్తిని రాహుల్ గాంధీ ఉదహరించారు. "తొల గించిన" ఓటర్లలో ఒకరైన బాబిటా చౌదరిని ఆయన వేదికపైకి తీసుకువచ్చారు. నాగరాజ్ అనే వ్యక్తి ఉదయం 4:07 వద్ద కేవలం 38 సెకన్లలో రెండు డిలెట్ అప్లికేషన్లు నింపాడని ఆరోపించారు. ఇది "మానవీయంగా అసాధ్యం" అని రాహుల్ గాంధీ అన్నారు.

రాహుల్ గాంధీ మహారాష్ట్రకు చెందిన రాజురా అసెంబ్లీలో నకిలీ ఓటర్ల చేర్పులను వివరించారు. విచిత్రమైన ఎంట్రీలతో ఈ ఓటర్ల చేర్పులు జరిగాయని అన్నారు. అందులో ఒకటి ఓటరు పేరు:"వైయూహెచ్ యూక్యూజేజేడబ్ల్యూ", చిరునామా : "షష్టి, షష్టి" అని రాహుల్ గాంధీ ఉదహరించారు. ఈ ప్రక్రియలో మిగతా 7లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

'డిఎస్‌సి' సభ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి - 2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం సచివాలయం ప్రాంగణంలో నియామక పత్రాలు అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు మెగా డిఎస్‌సి కన్వీనర్ - 2025 ఎంవి కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

వరి దుబ్బులతో రైతుల ఆందోళన

- యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు

3

అదానీకి సెబీ క్లీన్‌చిట్

హిండెన్‌బర్గ్ కేసులో అనూహ్య ఆర్డర్



ముంబయి : దేశంలోని న్యాయస్థానాలే కాదు కీలక రెగ్యులేటరీ సంస్థలు సైతం అదానీకి అనుకూలంగా మారాయి. అదానీ ఆర్థిక అక్రమాలపై అమెరికాకు చెందిన రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన కీలక ఆరోపణలను సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) తాజాగా తోసిపుచ్చింది. అదానీ గ్రూప్ కంపెనీలు ఎటువంటి నియంత్రణ ఉల్లంఘనలకు పాల్పడలేదని గురువారం పెట్టుబడులు, మార్కెట్ల రెగ్యులేటర్ క్లీన్‌చిట్ ఇచ్చింది. "అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరూపణ కాలేదు. అదానీ గ్రూప్ కంపెనీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఆ సంస్థపై జరిమానా విధించాల్సిన అవసరం లేదు." అని సెబీ హోల్ టైం మెంబర్ కమలేష్ చంద్ర వర్షనేయ్ తన ఆర్డర్‌లో పేర్కొన్నారు. దీంతో అదానీ పోర్ట్స్, అదానీ పవర్, గౌతమ్ అదానీ, రాజేష్ అదానీలపై కొనసాగుతున్న దర్యాప్తు కార్యకలాపాలను సెబీ రద్దు చేసినట్లయ్యింది. గౌతం అదానీ అవినీతిని కీలక ఆధారాలతో 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని.. అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, సాక్ష్యాలను సంపాదించామని... దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో పొందుపర్చామని అప్పట్లో హిండెన్‌బర్గ్ పేర్కొంది. అప్పటి సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధాన్ని సైతం బయటపెట్టిన విషయం తెలిసిందే. బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిందని హిండెన్‌బర్గ్ తెలిపింది. 'అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ ఛైర్మన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది.' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ కంపెనీలతో సెబీ మాజీ ఛైర్‌పర్సన్ మాధాబి అంటకాగడం.. ఇతర తీవ్ర ఆరోపణల నేపథ్యంలో సెబీ తాజా ఆర్డర్ నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది.



జీరో అవర్‌ను సీరియస్‌గా తీసుకోండి

- మంత్రులపై స్పీకర్ అసహనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభలో జీరో అవర్‌లో సభ్యులు అడిగే ప్రశ్నలను మంత్రులు, అధికారులు నోట్ చేసుకోకపోవడం పట్ల శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు నోట్ చేసుకుని సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఆయా సభ్యులకు పంపే సాంప్రదాయం ఉందని, కనీసం ఈ విషయాన్ని మంత్రులు సీరియస్‌గా తీసుకోకపోవడం ఇదేం పద్దతని స్పీకర్ ప్రశ్నించారు.. ఇదే అంశంపై రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ జీరో అవర్‌లో అడిగే ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సందర్భంలో స్పీకర్ స్పందిస్తూ శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సంతకం చేసిన సభ్యులు మాత్రమే ప్రశ్నలడిగేందుకు అవకాశం ఇస్తానని, అంతేకాని ప్రతి ఒక్కరికి శుక్రవారం నుంచి అవకాశం ఇవ్వలేమని, ఈ విషయాన్ని సభ్యులు గమనంలోకి తీసుకోవాలని సూచించారు. సభ్యులు ప్రశ్నలడగాలనుకుంటే ముందస్తుగా ప్రశ్నలను రాసి పంపాల్సి ఉంటుందన్నారు. జీరో అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదనే అంశంపై స్పందించిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రులు సభ్యుల ప్రశ్నలను రాసుకుని సమాధానాలు పంపించే విధంగా చర్యలు తీసుకుంటామని సభకు తెలిపారు.

బ్యాటరీ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- ఏర్పేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని వికృతమాల ఏరియాలో ఇఎంసి 2 వద్ద మునోత్ ఇండస్ట్రీ (లిథియం బ్యాటరీ మ్యానుఫ్యాక్చరింగ్)లో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంబంధించింది. లిథియం బ్యాటరీ ఒక్కసారిగా పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు రెండుగంటలపాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ పరిశ్రమలో మొబైల్ పవర్ బ్యాంక్స్, స్మార్ట్‌ఫోన్ బ్యాటరీస్, ల్యాప్‌టాప్స్, మెడికల్ డివైసెస్‌లో ఉపయోగించే లిథియం పాలిమర్ సెల్స్ వంటివి ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఈ పరిశ్రమలో ఉత్పత్తి లేనందున నైట్‌షిఫ్ట్ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఫైర్ అధికారి అసిస్టెంట్ డిఎఫ్ఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ... లిథియం బ్యాటరీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ కావడంతో ఎక్కువగా కెమికల్స్, కేబుల్స్, బ్యాటరీస్ ఉండడం వలన పెద్ద ఎత్తున మంటలు చేలరేగాయని తెలిపారు. పది ఫైర్ ఇంజన్లతో దాదాపు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశామని తెలిపారు. ఏర్పేడు సిఐ బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రమాద కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆర్‌డిఓ భాను ప్రకాష్, ఎంపిడిఓ సౌభాగ్యమ్మ, ఆర్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

దేవాలయ కమిటీలకు ఛైర్మన్లు నియామకం

- దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని నాలుగు ప్రముఖ ఆలయాలకు ప్రభుత్వం గురువారం ఛైర్మన్లను నియమించింది. శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం ఛైర్మన్‌గా పోతుగుంట రమేష్‌నాయుడు, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా కొట్టెసాయిప్రసాద్, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఛైర్మన్‌గా వి.సురేంద్రబాబు(మణినాయుడు), విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ(గాంధీ), వాడపల్లి శ్రీ వెంకటేశ్వర ఆలయ ఛైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజుని నియమించారు. అలాగే టిటిడి బోర్డు లోకల్ అడ్వైజరీ కమిటీ ప్రెసిడెంట్లుగా జూబ్లీహిల్స్‌కు ఎవి రెడ్డి, హిమయత్‌నగర్‌కు నేమూరి శంకర్‌గౌడ్, బెంగుళూరు కమిటీకి వీరాంజనేయులు, ముంబైకి గౌతమ్ సింగానియా, విశాఖపట్నానికి వెంకట పట్టాభిరామ్ చోడేలను నియమించారు.

4 రోజులపాటు మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న నాలుగు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాని హెచ్చరించారు. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఉల్లి సేకరణ ఎప్పుడు?

యూరియా కొనాలంటే గ్రోమోర్ కొనాలా?
ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి
జీరో అవర్‌లో సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సమావేశాల తొలిరోజైన జీరోఅవర్‌లో వివిధ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కమలాపురం ఎమ్మెల్యే పి. కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ ఉల్లి కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గైడ్‌లైన్స్ విడుదల చేయలేదనే కారణంతో సేకరణ ప్రారంభించలేదన్నారు. అసలే వర్షాకాలం కావడంతో రైతులు పంటను నిల్వ చేసుకోలేక పోతున్నారని, ఫలితంగా వర్షానికి తడిచిన ఉల్లి కుళ్లిపోయే అవకాశం ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉల్లి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం త్వరిత గతిన గైడ్‌లైన్స్ విడుదల చేయాలని కోరారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా ఇవ్వాలంటే గ్రోమోర్‌తో పాటు ఇతరత్రా ఎరువులు కొనాలని అధికారులు వత్తిడి చేస్తున్నారని చెప్పారు. తమ నియోజకవర్గంలో టిడ్కో గృహాలను జగనన్నకాలనీలుగా మార్చారని ఇందులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయన్నారు. శ్రీకాళహస్తి మండలాన్ని అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలని ప్రభుత్వాన్ని కోరారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ వైసిపి హయాంలో మదనపల్లిలో రూ.65కోట్లతో మెడికల్ కళాశాల నిర్మించారని, భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, ఈ విషయంపై హౌస్‌కమిటీ వేయడంతో పాటు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న రీ సర్వేలో అనేక తప్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ వికలాంగులకిచ్చే సదరం సర్టిఫికెట్ల కోసం గ్రామ వార్డు సచివాలయాల్లో స్లాట్‌లు బుక్‌చేసుకోవడం కష్టమవుతోందన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమబోర్డును త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. . ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్‌కు అత్యధిక నిధులు కేటాయించాలని, యోగివేమన జన్మదినాన్ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాల వాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు మాట్లాడుతూ విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న 9గ్రామాలను విజయ వాడ రూరల్ మండలంలో చేర్చాలన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ బుడమేరుకు సంబంధించి తమ నియోజకవర్గంలో మూడు చోట్ల కరకట్టలను బలోపేతం చేయాలని కోరారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిధిగజపతిరాజు మాట్లాడుతూ 2019కు ముందు భర్తలు చనిపోయిన మహిళలకు వితంతు పెన్షన్ రావడంలేదని, వారికి కూడా పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ జయలక్ష్మి కో ఆపరేటివ్ సొసైటీలో మార్టిగేజ్‌లో ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు కూడా రిలీజ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కో ఆపరేటివ్ సొసైటీలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, రెగ్యులర్‌గా ఆడిట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి..

- మండలిలో నిలదీస్తాం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసన సభలో ఏకైక ప్రతిపక్షమైన తమకు ప్రతిపక్ష హోదా ఇచ్చి, ఆ మేరకు సమయం కేటాయిస్తానే అసెంబ్లీకి వెడతామని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ప్రజాప్రతినిధులతో తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దీనికి శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అందరితో సమానంగా రెండు నిమిషాలు సమయం ఇస్తానంటే అసెంబ్లీకి వెళ్లినా ఉపయోగం లేదన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలో ప్రశ్నించాలన్నారు. మండలిలో వైసిపికి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామన్నారు. ప్రస్తుతం ఎరువులు, డయేరియా, పిపిపి, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశాలు కీలకంగా ఉన్నాయని తెలిపారు. నిత్యావసర ధరలు పెరిగాయని, యూరియా అందుబాటులో లేదని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు లేకుండాపోతున్నాయని, టమోటాలు రోడ్డుపై పారబోసే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఉల్లిపాయలకు ధర లేకుండా పోయిందని పేర్కొన్నారు. మరోవైపు వైసిపి నేతలను కేసులతో వేధిస్తున్నారని చెప్పారు. మండలిలో సీనియర్లు ఉన్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉన్న అవకాశాలను దుర్వినియోగం చేయొద్దని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రతిపక్ష హోదాకు సంబంధించి కోర్టులో కేసు ఉందని, దీనిపై ఇంతవరకు కోర్టుకు సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. హైకోర్టుకు ఇచ్చే తీర్పు ఆధారంగా సభకు వెళ్లే అంశాన్ని ఆలోచిద్దామని జగన్ అన్నారు. ఈలోపు సభ్యులందరూ ప్రజాక్షేత్రంలో సమస్యలపై నిలదీయాలని, కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని అన్నారు. కేసులకు భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథరెడ్డి, చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కల్యాణి, భరత్, మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంకుతో ఒప్పందాన్ని రద్దు చేయండి

- ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి
- కొనసాగుతున్న యుటిఎఫ్ రణభేరి జాతాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ బ్యాంకుతో చేసుకొన్న ఒప్పందంలో భాగంగా విద్యా రంగం బలహీన పడుతుందని, తక్షణం ఆ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతాలు అన్నమయ్య, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, కోనసీమ, అల్లూరి జిల్లాల్లో కొనసాగాయి.అన్నమయ్య జిల్లా రాజంపేటలో భువనగిరిపల్లి ఆర్చి నుంచి పాత బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బోధనేతర కార్యక్రమాలన్నింటి నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు, కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరిలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవీణ్ ప్రకాష్ ముసుగులో ఉపాధ్యాయులను అంతర్జాల కబంధ హస్తాల్లో పెట్టి



భీమవరం రణభేరి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో డ్రమ్‌ను మోగిస్తున్న యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. పిఆర్‌సి కమిషన్ నియమిస్తామని, పెండింగ్‌లో ఉన్న డిఎలు, రూ. వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని, ఉపాధ్యాయులకు మరింత గౌరవాన్ని పెంచుతామని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసగించారని విమర్శించారు. గుంటూరులో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, రాష్ట్ర అడిట్ కమిటీ చైర్మన్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో సాగింది. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎన్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు తదితరులు మాట్లాడుతూ.... బోధనేతర పనులను నిలిపేయాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, యాప్‌ల భారాలను తొలగించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు మండలాల్లో జాతా కొనసాగింది. ఈ జాతా సాయంత్రానికి పాడేరు ఘాట్ రోడ్డు మీదుగా అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. అల్లూరి, ఇటు అనకాపల్లి జిల్లాల్లో నిర్వహించిన ర్యాలీలు, సభల్లో సంఘం రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, నాయకులు శ్రీలక్ష్మి, కె.విజయగౌరి, ఎస్.కిషోర్ కుమార్ పాల్గొన్నారు ఒంగోలు, నెల్లూరులో జాతాలు కొనసాగాయి.

రెండేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి

- రూ.2,400కోట్లు అంచనా
- ప్రశ్నోత్తరాల్లో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ రెండేళ్లలో పూర్తి చేస్తామని, ఇందుకోసం రూ.2,400కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో శ్రీకాకుళం నియోజకవర్గంలోని చిట్టచివరి ప్రాంతాలకు సాగునీరు అనే అంశంపై శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ సిఎం సూచనల మేరకు ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి ఎంత అవసరమనే అంశంపై అంచనా వేశామన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రెండేళ్ల కాల వ్యవధిని నిర్ణయించుకుని తొలి ఏడాది రూ.వెయ్యినుంచి రూ.1200కోట్లు, రెండో సంవత్సరం కూడా రూ.వెయ్యి నుంచి రూ.120కోట్లు ఖర్చు చేసి ఆయా ప్రాజెక్టులు పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు సభకు తెలిపారు. బిఆర్‌ఆర్ వంశధార, వంశధార నాగావళి లింక్, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, జంజావతి, హీరమండలం లిఫ్ట్, నాగావళి-చంపావతి, మహేంద్రతనయ వంటి కీలకమైన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి వివరించారు. రాయలసీమలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు హంద్రీనీవాను కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సిఎం చంద్రబాబు ఎలా ప్రారంభించారో అదే మాదిరి ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు కూడా రెండేళ్లలో పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. పోలవరం ఎడమ కాలువకు రూ.1200కోట్లు కేటాయించి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లబోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

వంశధార కుడి కాలువ ఆయకట్టుకు సంబంధించి శివారు భూములకు నీరు అందడం లేదన్న సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ వంశధార కుడికాలువ ఆయకట్టు 4600 ఎకరాలు కాగా అందులో ఇప్పటికీ 2014 ఎకరాలకు నీరు అందని మాట వాస్తవమేనని, 2011లో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ మధ్యలో నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. వంశధార కుడి కాలువ లైనింగ్8ఓటిలు, రెండు స్ట్రక్చర్లు నిర్మించడం ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని అంచనావేసినట్లు మంత్రి తెలిపారు. వంశధార కుడికాలువ ఆయకట్టు శివారు 11గ్రామాలకు సాగునీరు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. టిడ్కో ఇళ్లపై జరిగిన చర్చలో బిజెపి శాసనసభాపక్ష నాయకుడు పెనుమత్స విష్ణుకుమార్‌రాజు, కామినేని శ్రీనివాసరావు, ఈశ్వరరావునడికుదిటి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిస్తూ రాష్ట్రంలో 51 ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తవగా, మరో 112 చోట్ల పూర్తి చేయాల్సి ఉందన్నారు. 2014-19లో కేంద్ర ప్రభుత్వం 7,01,481 టిడ్కో ఇళ్లను రాష్ట్రానికి కేటాయించిందన్నారు. వీటిలో 5,14లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనా అనుమతులు తీసుకుని టెండర్లు పిలిచామన్నారు. గత ప్రభుత్వం వీటిని 2,61,640కు తగ్గించడమే కాకుండా ఇళ్లను కూడా పూర్తి చేయలేదన్నారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేందుకు మొత్తం రూ.6139కోట్లు కావాలన్నారు. హడ్కో రూ.4,500కోట్లు రుణం ఇవ్వడానికి అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. హడ్కో నిధులు విడుదలైన తర్వాత బిల్లులన్నీ క్లియర్ చేయడం జరుగుతుందన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే ఉద్యమం

- జై భీమ్ రావు భారత్ పార్టీ మహాధర్నాలో నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వివిధ పార్టీల నేతలు, దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. టిడిపి కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం విజయవాడ అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్‌లో మహాధర్నా జరిగింది. జైభీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ న్యాయమూర్తి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ చేపట్టిన ఈ మహాధర్నాకు వైసిపి, వామపక్ష, పలు దళిత సంఘాలు సంఘీభావం తెలిపాయి. వైసిపి నాయకులు, మాజీ మంత్రి విడుదల రజిని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎస్‌సి కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి నేతలు పూలమాలలు వేసి


మహాధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఘన నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానం పేరుతో ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. ప్రజలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేయాలనే ఆలోచనలో భాగంగానే పిపిపి విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తెస్తోందని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కితీసుకోకుంటే ఐక్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావు భారత్ పార్టీ నేతలు పరస సురేష్, కొండలరావు, జగ్గవరపు మల్లిఖార్జున, దళిత మహిళా సంఘ నేత మంచాల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఉపసంహరించే వరకు ఉద్యమం : శ్రీనివాసరావు

ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలకు ఉపసంహరించుకునే దాకా ఉద్యమిస్తామన్నారు. గతంలో జార్ఖండ్‌లో కూడా ఇలాగే వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడ్డారని గుర్తుచేశారు. దీంతో ఆ ప్రభుత్వం మళ్లీ ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలను నడిపిందని పేర్కొన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో సామాన్యులకు వైద్య విద్య అందకుండా పోతుందన్నారు.

'ఇండోసోల్'ను కరేడుకు ఎందుకు మార్చారు

- 'రామాయపట్నం'కు 20వేల ఎకరాలు ఎక్కడ తీసుకుంటున్నారు
- మండలిలో వైసిపి ఎమ్మెల్సీ మాధవరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండోసోల్ కంపెనీకి కరేడు గ్రామంలో భూసమీకరణ ఎందుకు చేస్తున్నారని వైసిపి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో భూసేకరణపై శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో గురువారం ఆయన ప్రశ్నించారు. ఇండోసోల్ కంపెనీకి గత ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో చెవూరు, రావూరు వద్ద భూమి కేటాయించిందని తెలిపారు. ఈ భూములను రద్దు చేయకుండా ప్రభుత్వం కరేడులో 8,214 ఎకరాలను ఎందుకు సేకరిస్తోందని ప్రశ్నించారు. కరేడు భూసేకరణను 8 బ్లాకులు చేసి 5 బ్లాకులకు నోటిఫికేషన్ చేశారని తెలిపారు. వ్యతిరేకిస్తున్న ప్రజలను మభ్యపెట్టి విడతల వారీగా తీసుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములను ఇండోసోల్ కంపెనీకి అప్పగించబోమని ఆ ఊరి గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారని, ఈ తీర్మానంపై తనతోపాటు జిల్లా సబ్‌కలెక్టర్ తదితరులు సంతకాలు చేశారని చెప్పారు. భూములు పోతే తమ ఉపాధి పోతుందనే భయంతో కరేడు ప్రజలు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో అన్ని రకాల పంటలు పండిస్తున్నారని చెప్పారు. 9 ఫిషింగ్ హేచరీస్, రిసార్ట్స్ వంటివి ఉండటం వల్ల 22 వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. భూసేకరణ జరిగితే వీరందరి ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములివ్వబోమని మాట్లాడిన మహిళను అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని వివరించారు. సెక్షన్ 30పేరుతో ఊరిలోకి ఎవరినీ అనుమతించడం లేదన్నారు. రాయాయపట్నం పారిశ్రామీకరణ పేరుతో రాష్ట్రప్రభుత్వం 20వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు, భూ సేకరణ కోసం స్పెషల్ కలెక్టర్‌తో పాటు, డిప్యూటీ కలెక్టర్లను నియమించిందని తెలిపారు. ఈ భూములు ఎక్కడ తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామికరణ కోసం భూములను తీసుకుంటున్నామని చెప్పారు. కరేడులో స్వచ్ఛందంగా రైతుల నుంచి భూములను సేకరిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 500 ఎకరాల భూములు సేకరించామని, ఎకరాకు రూ.20 లక్షల వరకూ నష్టపరిహారం అందిస్తున్నామని తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోవూరు (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో కురిసిన వర్షానికి పిడుగు పడి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కోవూరు మండలం వేగూరు పంచాయతీ దళితవాడ ప్రాంతానికి చెందిన గోళ్ల వెంకయ్య (63) గురువారం యథావిధిగా పశువులను తోలుకొని పొలం వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడటంతో మృతిచెందాడు.

తొలగించిన ఓట్ల వివరాలు బయట పెట్టాలి

- పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల వివరాలను వారం రోజులలోపు బయట పెట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఇందుకు ఉపయోగించిన ఫోన్ నంబర్లు, తదితర వివరాలను వెల్లడించాలని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ తీగలాగుతుంటే డొంక కదులుతోందని పేర్కొన్నారు. ఓట్ల దొంగ బాగోతాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టేందుకు పథకం ప్రకారమే దేశంలో ఓట్ చోర్ జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రాహుల్ గాంధీ వాస్తవాలను ఆధారాలతో సహా దేశ ప్రజల ముందుంచారని వెల్లడించారు. ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) గుప్పిట్లో పెట్టుకుని అధికారం కోసం మోడీ చేసింది చీకటి రాజకీయమేనని విమర్శించారు. స్వయం ప్రతిపత్తి గల సంస్థ ఇసిఐ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. లక్షలాది మంది ఓటు హక్కును కాలరాసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు కీలక స్థానంగా ఉన్న అలంద్ నియోజకవర్గంలో 6 వేల ఓట్లను నకిలీ లాగిన్ నుంచి తొలగించడం సహించరాదని చర్యగా అభివర్ణించారు.


ప్రమాద ఘటనను చూస్తున్న అధికారులు, పోలీసులు, యాజమాన్యం

'అరబిందో'లో అగ్ని ప్రమాదం

- మీడియాను అనుమతించని యాజమాన్యం

ప్రజాశక్తి - నాయుడు పేట (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు 5 ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేశాయంటే ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రమాదానికి గల కారణాలు యాజమాన్యం మీడియాకు తెలియజేయకపోగా వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మీడియాను అనుమతించకుండా అడ్డుకుని పరిశ్రమలోనికి ఎవ్వరు రాకూడదంటూ దౌర్జన్యానికి పాల్పడడం గమనార్హం. ఇక్కడ ఎటువంటి పెద్ద ప్రమాదం జరగలేదని, చిన్నపాటి కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొద్దిపాటి మంటలు చెలరేగాయని పొగ అలుముకుందని, స్థానికులు భయాందోళనకు గురై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారని పరిశ్రమ యాజమాన్యం చెబుతోంది. నాయుడుపేట ఎస్సై ఆదిలక్ష్మి మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లామని అప్పటికే మంటలు అదుపు చేశారని, ప్రమాదానికి గల కారణాలపై టెక్నికల్ అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది మాత్రం ఈ ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణమని, ప్రమాదంలో చాలా మంది గాయపడినట్లు చెబుతున్నారు. మీడియాను అనుమతించకపోవడం, అధికారులు ప్రమాదానికి గల కారణాలను దాటవేయడం చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం

- 57.99 ఎకరాలు కేటాయింపు
- ప్రతిపాదనలకు ఆహ్వానం పేరుతో టెండర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధానిలో తొలిసారి పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.. దీనికోసం మూడు ప్రాంతాల్లో 57.99 ఎకరాలను కేటాయించారు. ఈ మేరకు విడుదల చేసిన ఈ మేరకు టెండర్లు పిలిచారు. నోటిఫికేషన్‌లో పెట్టుబడిదారులు ఐదేళ్లలో పూర్తిగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. దీనికి అవసరమైన బ్యాంకు గ్యారంటీ కూడా ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. రాజధాని నగరం పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుకుని మూడుచోట్ల పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. అయితే ఏమి కట్టాలి, ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలను టెండర్ డాక్యుమెంట్లో పొందుపరచలేదు. సహజంగా ఏదైనా కట్టాలనుకుంటే దానికి సంబంధించిన వివరాలను డాక్యుమెంట్లో పొందుపరుస్తారు. అటువంటిదేమీ లేకుండానే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్‌ఎఫ్‌పి)ని ఆహ్వానించారు. పూర్తి పెట్టుబడి ఎంత. బ్యాంకు గ్యారంటీ ఎంత తీసుకోవచ్చు అనే అంశాల వద్ద గ్యాప్‌లు వదిలేశారు. టెండరుదారుడు వచ్చి తన ప్రతిపాదన సమర్పించిన తరువాత వాటిని పూర్తి చేసే విధంగా టెండర్లు తయారు చేశారు. పిచ్చుకలపాలెం(దొండపాడు)లో 7.93 ఎకరాలు స్థలం ప్రతిపాదిత స్పోర్ట్స్ సిటీ పరిధిలో కేటాయించారు. దీనిలో కనీసం రూ.50 కోట్లకు తక్కువగాకుండా పెట్టుబడులు పెట్టాలని సూచించారు. రాయపూడిలో 30.34 ఎకరాలు, మందడంలో 19.72 ఎకరాలు కేటాయించారు. ఈ రెండుచోట్ల రూ.100 కోట్లకు తక్కువగాకుండా ప్రాజెక్టులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ అమరావతి పరిధిలో వేర్వేరు ప్రైవేటు సంస్థలకు నేరుగా భూములు కేటాయించారు. వీటిల్లో ఒకటి స్పోర్ట్స్‌సిటీ పరిధిలోనూ, మరొకటి ప్రభుత్వ కోర్ ఏరియాకు ఆనుకుని అభివృద్ధి చేయనున్నారు. రాయపూడి సమీపంలో కేటాయించిన 30.34 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధి చేయనున్నట్లు తెలిసింది. మరోవైపు రాజధాని పరిధిలో హోటళ్లకు, కన్వెన్షన్ సెంటర్లకు స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే.

అట్రాసిటీ కేసుల్లో రాజకీయ జోక్యం

- 25న విజయవాడలో ధర్నా : ఆండ్ర మాల్యాద్రి

గుంటూరు: ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, బాధితులపై కౌంటర్ కేసులను అంగీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈనెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు బాధితులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ కోరారు. గుంటూరులోని కెవిపిఎస్ కార్యాలయంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వటం ఆపాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె. నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ... ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు బాధితులు, దళిత సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు కె. జయసుధ, గిరిజన సంఘం నాయకులు చంద్రా నాయక్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఏనుగుల కమలాకర్, జిల్లా నాయకులు బురుగ వెంకటేశ్వర్లు, యన్.విజయరాజు, ఎస్. కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, బి.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు

ఎపి ఆటో, క్యాబ్, టాటా ఏస్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల ఐక్యవేదిక మహాధర్నా

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆటో, క్యాబ్ డ్రైవర్లు కదంతొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆటో, క్యాబ్, టాటా ఏస్, ట్రాన్స్‌పోర్ట్ రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన రవాణా రంగ కార్మికులు గురువారం మహార్యాలీ నిర్వహించారు. విజయవాడలోని రైల్వే స్టేషన్ నుంచి ఏలూరు లాకులు, గాంధీనగర్‌ల మీదుగా ధర్నా చౌక్‌కు భారీ ప్రదర్శన నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు అందరికీ వాహన మిత్ర వర్తింపజేయాలని, ఈ పథకం కింద అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రూ.30 వేలకు పెంచాలని, జిఒ 21ని రద్దు చేయాలని, ఆటో మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వాహన మిత్ర పథకానికి 300 యూనిట్ల విద్యుత్, ఆదాయపుపన్ను, చలానాల పేరుతో వేలాది మంది కార్మికులను అనర్హులుగా చేయడం అన్యాయమన్నారు. నిబంధనల పేరుతో ఆటో కార్మికులకు అన్యాయం చేయడాన్ని ఖండించారు. డ్రైవింగ్ లైసెన్స్‌నే అర్హతగా వాహన మిత్ర అమలు చేయాలన్నారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు తరహాలో సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఓలా, ఉబర్ యాప్‌ల స్థానంలో కేరళ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విధంగా ప్రభుత్వమే ఎటువంటి చార్జీలు లేకుండా యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల ఆందోళనకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు కె.పోలారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఆటో మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలపై అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా ప్రభుత్వం ఇంత వరకూ స్పందించలేదన్నారు. మంత్రివర్గ ఉపసంఘం పేరుతో కాలయాపన చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్రంలో 7 లక్షల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ ఉపాధిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టిన షరతుల వల్ల కేవలం 2.75 లక్షల మందికే ప్రయోజనం అందుందని, 4 లక్షల మందికి ఎటువంటి తోడ్పాటు లభించడం లేదన్నారు.



మహాప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, నాయకులు

ఎపి ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. జరిమానాల పేరుతో ఆటోవర్కర్లను ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. జిఒ 21ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినా, ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్.శివాజి, కోశాధికారి కె.దుర్గారావు, ఐఎఫ్‌టియు ఆటో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఎం.శంకర్, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు ఉదయ్‌కిరణ్, ఈశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ, ఆర్.రవీంద్ర, ఆర్.వెంకటేష్, వైఎస్‌ఆర్‌టియు నాయకులు కిరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


పెదకాద రైతు సేవా కేంద్రంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

వరి దుబ్బులతో రైతుల ఆందోళన

- యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు

ప్రజాశక్తి–దత్తిరాజేరు (విజయనగరం)

యూరియా కోసం రైతు కన్నీరు పెడుతున్నాడు. రోజుల తరబడి రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల చుట్టూ తిరుగుతున్నా ఎరువు అందకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెదకాద, మజ్జిపేట గ్రామాలకు చెందిన రైతులు సచివాలయం వద్ద వరి దుబ్బులు, పురుగుమందు డబ్బాలు పట్టుకొని ఆందోళనకు దిగారు. ఎరువులు ఇవ్వకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని, ఎరువు ఇవ్వకుండా వరి దుబ్బును చంపేసినట్లు తమను కూడా చంపేయండి అంటూ అధికారులతో తమ గోడు చెప్పుకున్నారు.

రైతుసేవా కేంద్రానికి రెండు దఫాలు యూరియా వచ్చినా తమకు ఒక్క బస్తా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రైతు సేవా కేంద్రానికి 267 యూరియా బస్తాలు వచ్చాయి. అయితే కూఆర్ కోడ్ రాలేదంటూ అధికారి లావణ్య యూరియా పంపిణీ చేయలేదు. అప్పటికే వేచి ఉన్న రైతులు తమ కడుపు మంట అధికారులకు తెలియదా అని కన్నీరు పెట్టుకున్నారు. మరి కొంతమంది భూమి పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు తీసుకువచ్చి అధికారుల ముందు పెట్టి యూరియా పంచాలని డిమాండ్ చేశారు. నాట్లువేసి 15 రోజుల దాటినా ఇంతవరకు యూరియా వేయకపోతే ఎలా దుబ్బు కట్టి పంట పడుతుందని నిలదీశారు. విషయం తెలుసుకున్న పెదమానాపురం ఎస్‌ఐ జయంతి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. శనివారం యూరియా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ విషయమై వ్యవసాయశాఖ సిబ్బందిని వివరణ కోరగా రైతు సేవా కేంద్రానికి 267 యూరియా బస్తాలు వచ్చాయని, క్యూఆర్ కోడ్ రాకపోవడంతో పంపిణీ చేయలేకపోయామని, వచ్చిన తర్వాత రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

మరో 13 వేల మెట్రిక్ టన్నుల యూరియా

- మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రానికి మరో 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్రం కేటాయించిన యూరియా ఈ నెల 20వ తేదీ నాటికి రాష్ట్రంలో గంగవరం పోర్ట్‌కు చేరుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజా కేటాయింపులతో రైతులకు యూరియా విషయంలో మరింత వెలుసుబాటు లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎరువులు కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతుల అవసరాలను, సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకు వస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలను కల్పించమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు.

మందస ఎయిర్‌పోర్టుపై ప్రజలను ఒప్పిస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి


శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో నిర్మించనున్న కార్గో ఎయిర్‌పోర్టును ప్రజలు వ్యతిరేకించేలా కాకుండా వారిని ఒప్పించి నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు వస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనేది అనేక అనుభవాలు చెప్తున్నాయన్నారు. ఎయిర్‌పోర్టుతో ఎకనామీ ముడిపడి ఉందన్నారు. దేశంలో ప్రతి ఎంపి తన నియోజకవర్గంలో ఒక ఎయిర్‌పోర్టు కావాలని కోరుకుంటున్నారన్నారు. జార్ఖండ్, ఛత్తీస్‌గడ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో కలిపి దేశవ్యాప్తంగా 50 ఎయిర్‌పోర్టులు నిర్మిస్తామన్నారు. మూలపేట పోర్టును ఆనుకుని గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చాలామంది పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని తెలిపారు. టైటానియం కాంప్లెక్స్ నెలకొల్పాలని కొందరు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని, అటువంటి వారితో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకు కోస్టల్ కారిడర్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారని తెలిపారు. తీరం వెంబడి హెవీ మినరల్స్ తవ్వి రవాణా చేసేందుకు అదాని కోసమే కోస్టల్ కారిడార్ నిర్మిస్తున్నారన్న ప్రశ్నకు బదులిస్తూ ఏ ఒక వ్యక్తి కోసం కాదని సమాధానమిచ్చారు. శ్రీకాకుళం తీరంలో హెవీ మినరల్స్ లభ్యం కావడంతో పాటు టైటానియం కూడా దొరకుతోందని, వాటన్నింటి నుంచి వచ్చే తుది ఉత్పత్తులు ఎక్కడో కాకుండా ఇక్కడే తయారయ్యేలా చూడాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు వివరించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎపి ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా విజయభాస్కరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి – ఎస్‌వియుక్యాంపస్ :

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర విభాగంలో సీనియర్ ఆచార్యులుగా పనిచేస్తున్న ఆచార్య ఎస్ విజయభాస్కరరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. యాప్సి కార్యాలయంలో ఆయన గురువారం వైస్ చైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, వర్సిటీ ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో బోధనా రంగంలో చక్కటి అభివృద్ధి ప్రణాళికలను రచించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


యాప్సి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య ఎస్.విజయభాస్కరరావు

పరిశోధనా రంగంలోనూ ఆర్థిక వనరులు, పరిశోధనా సౌకర్యాలపై పర్యవేక్షణ జరిపి అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని వర్సిటీలలో దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా పరిశోధనారంగాన్ని అభివద్ధి పరచాలన్నారు. పరిశోధకులకు సమగ్రమైన అవగాహన ఉండే అంశాలపై ప్రత్యేకమైన దృష్టిసారిస్తామని తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షులుగా చప్పిడి రాజశేఖర్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో




ఆంధ్రప్రవాసి అధినేత, ఎపి ఎన్నార్టీస్ మాజీ డైరెక్టర్, ప్రముఖ సాహితీ, కళారంగ ప్రముఖులు చప్పిడి రాజశేఖర్ శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ఏడాది ప్రభుత్వ గిడుగు రామ్మూర్తిపంతులు పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ప్రపంచంలోని ప్రవాసాంధ్రులను ఐక్యం చేయటంలోనూ, వారి సమస్యల పరిష్కారంలోనూ ఆయన గత కొన్ని దశాబ్దాలుగా నిరంతరం కృషిచేస్తున్నారు. పలు సాహిత్య, కళావేదికల్లోనూ ఆయన ముఖ్య కీలకభూమిక పోషిస్తున్నారు. ప్రపంచంలోని తెలుగు ప్రజలను ఐక్యం చేయటంతోపాటుగా తెలుగు, భాష, కళలు, సాహిత్యం మరింత ఉన్నతంగా రావటానికి తనవంతుగా కృషిచేస్తాని చప్పిడి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమ్మెకాలపు వేతనాల కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి –యంత్రాంగం

సమ్మె కాలపు వేతన ఒప్పందాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు.

12వ పిఆర్‌సి ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసనలు, ర్యాలీలు చేశారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు.


కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో మున్సిపల్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఒంగోలులో సిఐటియు నగర కన్వీనర్ టి మహేష్, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరిస్తూ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. భీమవరం జిల్లా తణుకు మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబుకు వినతిపత్రం అందించారు.

శ్రీకాకుళం జిల్లా పలాస, పార్వతీపురం మన్యంజిల్లా సాలూరు, పార్వతీపురం, పాలకొండ, విజయనగరం జిల్లా నెల్లిమర్లలో మొయిద జంక్షన్ వద్ద, కడప జిల్లాలోని కడప, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లెలో, ఏలూరు జిల్లా, నూజివీడులో ఒంగోలు, అనంతపురం జిల్లాలోని కార్పొరేషన్, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు.

చేనేత కార్మికులను ఆదుకోవడంలో విఫలం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశకి – రేపల్లె (బాపట్ల జిల్లా)

సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత కార్మికులను ఆదుకోవడంలోనూ, సహకార సంఘాలను పరిరక్షించడంలోనూ ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్ల సాధన కోసం చేపట్టిన చేనేత అధ్యయన యాత్ర గురువారం రేపల్లె చేరుకుంది. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర బృందం చేనేత కార్మికులను కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ చేనేతలకు ఉచిత విద్యుత్ ఊసే లేకుండా పోయిందని విమర్శించారు. మగ్గం వేసే ప్రతి చేనేత కార్మికునితో పాటు ఉప వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులకు నేతన్న భరోసా పథకం ద్వారా సంవత్సరానికి రూ.36 వేలు అందించాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని, సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.127.87 కోట్లు తక్షణమే చెల్లించి సంఘాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు, చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహనరావు పాల్గొన్నారు.

విమాన రెక్కల్లో ఇరుక్కున్న పక్షి

- ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి – గోపాలపట్నం (విశాఖపట్నం)

ఎయిర్ ఇండియా విమానానికి పెద్ద ప్రమాదమే తప్పింది. పైలెట్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి గురువారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో హైద్రాబాద్‌కు 103 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికి దాని రెక్కల్లో పక్షి ఇరుక్కుంది. విషయాన్ని పసిగట్టి, అప్రమత్తమైన పైలెట్ ఉన్నతాధికారుల సూచనల మేరకు విమానాన్ని తిరిగి విశాఖ విమానాశ్రయానికి తీసుకొచ్చి సేఫ్ ల్యాండింగ్ చేశారు. దీంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

డిసెంబర్ కల్లా 40 కోట్ల గెలాక్సీ ఎఐ పరికరాలు

- సామ్‌సంగ్ వెల్లడి

న్యూఢిల్లీ : ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల గెలాక్సీ ఎఐ పరికారాలను తీసుకురానున్నట్లు సామ్‌సంగ్ తెలిపింది. 2024లో ప్రపంచంలోని మొట్టమొదటి ఎఐ ఫోన్, గెలాక్సీ ఎస్24 సిరీస్‌ను విడుదల చేసినట్లు గుర్తు చేసింది. ఇది తమ ఎఐ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేసిందని పేర్కొంది. తమ మొబైల్ ఎఐ పర్యావరణ వ్యవస్థను వేరబల్స్, టాబ్లెట్‌లు, పిసిలు తదితర ఉత్పత్తులకు విస్తరించినట్లు తెలిపింది.

క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లింపులు రద్దు

- యుపిఐ సంస్థల నిర్ణయం

న్యూఢిల్లీ : క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లింపుల సౌలభ్యాన్నిన రద్దు చేస్తోన్నట్లు ఫిన్‌టెక్ సంస్థలు ఫోన్‌పే, పేటియం, క్రెడ్ వెల్లడించాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తాజా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకొన్నాయి. ఇటీవల కాలంలో చాలా మంది క్రెడిట్ కార్డ్‌తో అద్దె చెల్లింపు ఆప్షన్‌ను విరివిగా ఉపయోగిస్తోన్నారు. నగదు కొరత ఉన్న సందర్భాల్లో దీనిని ఉపయోగించుకొని క్రెడిట్ కార్డు ద్వారా మరో అకౌంట్‌కు సొమ్ము బదిలీ చేసి.. అక్కడి నుంచి నగదు పొంది తమ అవసరాలు తీర్చుకుంటున్నారనేది ఆర్‌బిఐ గుర్తించింది. దీంతో ఫిన్‌టెక్ సంస్థల నిబంధనలను ఆర్‌బిఐ కఠినతరం చేసింది. దీంతో ఇన్నాళ్లు క్రెడిట్ కార్డులతో అద్దె చెల్లించిన వారికి ఇక ఇబ్బందిగా మారనుంది.

రూ.5400 కోట్ల ఎయుఎంకు బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్

న్యూఢిల్లీ : బజాజ్ ఫిన్‌సర్వ్ ఎంఎసికి చెందిన ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ నిర్వహణ ఆస్తులు (ఎయుఎం) రూ.5,410.04 కోట్లకు చేరాయని ఆ సంస్థ పేర్కొంది. కేవలం రెండేళ్లలోనే ఆగస్టు 31 నాటికి ఈ మైలురాయికి చేరినట్లు తెలిపింది. ఈ ఫండ్‌లోని నిధులను 81 స్టాక్స్‌ల్లో పెట్టుబడిగా పెడుతోన్నట్లు పేర్కొంది. ప్రతీ ఏడాది సగటున 19.19 శాతం రాబడులను అందించిందని వెల్లడించింది.

రెండున్నర నెలల్లో సుంకాలు తగ్గొచ్చు

అమెరికా కోత పెట్టొచ్చన్న సిఇఎ నాగేశ్వరన్

న్యూఢిల్లీ : వచ్చే రెండున్నర నెలల్లో భారత్‌పై అమెరికా సుంకాలు తగ్గొచ్చని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) అనంత నాగేశ్వరన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే 8–10 నెలల్లో టారిఫ్‌ల్లో కోత ఉండొచ్చన్నారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలును సాకుగా చూపుతూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలను విధించిన విషయం తెలిసిందే. మళ్లీ అమెరికాతో వాణిజ్య చర్చలు ప్రారంభమైన నేపథ్యంలో నాగేశ్వరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కోల్‌కతాలో మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరన్ మాట్లాడుతూ.. యుఎస్ తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలతో పాటు మరో 25 శాతం అదనపు సుంకాలను మనం ఊహించలేదన్నారు. రెండోసారి విధించిన 25 శాతం సుంకాలకు భౌగోళిక రాజకీయ పరిస్థితులు కారణమై ఉండొచ్చని భావిస్తున్నానని చెప్పారు. కాగా.. ఇటీవల పరిణామాలు గమనిస్తే నవంబర్ 30 తర్వాత అదనపు సుంకాల భారం ఉండకపోవచ్చన్నారు. అయితే తాను ఈ మాట చెప్పడానికి ఎలాంటి ఆధారం కూడా లేదన్నారు.



ఇది తన వ్యక్తిగత అభిప్రాయమేనన్నారు. యుఎస్ ప్రతీకార సుంకాలపై రానున్న రెండు నెలల్లో మరింత స్పష్టత రావొచ్చన్నారు. ప్రస్తుతం భారత ఎగుమతుల విలువ 850 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. రానున్న రోజుల్లో 1 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనుందని అంచనా వేశారు. జిడిపిలో ఎగుమతుల వాటా 25 శాతంగా ఉందన్నారు. ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను సూచిస్తోందన్నారు. ఇరు దేశాల మధ్య మంగళవారం నుంచి మళ్లీ వాణిజ్య చర్చలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పరస్పర ప్రయోజనకర రీతిలో ఈ ఒప్పంద చర్చలను ముగించాలని ఇరుపక్షాలు అంగీకరించాయని వాణిజ్య శాఖ పేర్కొంది.

దలాల్ స్ట్రీట్‌కు ఫెడ్ రేట్ల కోత జోష్

- సెన్సెక్స్ 320 పాయింట్ల పెరుగుదల

ముంబయి : అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో దలాల్ స్ట్రీట్‌లో జోష్ నెలకొంది. ఫెడ్ బాటలోనే ఆర్‌బిఐ నిర్ణయాలు ఉండొచ్చనే అంచనాల్లో గురువారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 320 పాయింట్లు లేదా 0.39 శాతం పెరిగి 83,013కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 93 పాయింట్లు లేదా 0.37 శాతం లాభపడి 25,423కు చేరింది. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపునకు తోడు జిఎస్‌టి సంస్కరణలు, అమెరికా–భారత్ మధ్య వాణిజ్య చర్చలు మార్కెట్లలో విశ్వాసాన్ని నింపాయి. ముఖ్యంగా ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఐటి, ఆటో, ఎఫ్‌ఎంసిజి షేర్లు రాణించాయి.

టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోవాలి

- ఎపి టెక్స్‌టైల్ మిల్లుల అసోసియేషన్ చైర్మన్ కోటిరావు

ప్రజాశక్తి – గుంటూరు

మూత పడిన మిల్లుల పునరుజ్జీవనానికి, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్లుల అసోసియేషన్ చైర్మన్ పి.కోటిరావు కోరారు. గుంటూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టెక్స్‌టైల్ మిల్లులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, ప్రస్తుతం 32 మిల్లులు మూతపడ్డాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే ఎపిలో విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు రూ.3లు అదనంగా ఉన్నాయని, గత పదేళ్లుగా రూ.900 కోట్ల సబ్సిడీలు విడుదల కాలేదని చెప్పారు. అమెరికా మార్కెట్‌లో ఎగుమతులపై టారిఫ్ పెంచటం, దిగుమతి పత్తిపై 11 శాతం సుంకం పూర్తిగా ఎత్తివేశారని పేర్కొన్నారు. నాణ్యమైన పత్తి ఉత్పత్తి గణనీయంగా తగ్గటం వల్ల పత్తి ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సబ్సిడీ బకాయిలు ఒకే విడతలో విడుదల చేయాలని, ఇడి ఛార్జీల పెంపును స్పిన్నింగ్ మిల్లులకు 5 సంవత్సరాలు నిలిపివేయాలని, యూనిట్‌కు రూ.2ల చొప్పున విద్యుత్ అందించాలని, బ్యాంకు రుణాలపై మారిటోరియం కల్పించి, రుణాలు పునర్వ్యవస్థీకరించాలని, ఎగుమతి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షల మంది కార్మికుల ఉపాధి, పత్తి రైతుల భవిష్యత్తు ఆధారపడి ఉన్న ఈ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి అధికారుల కమిటీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై, సమస్యలను సమగ్రంగా పరిశీలించిందని, నివేదికను సిఎంకు సమర్పించారని చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ పాలసీ 2024–29 కొత్త యూనిట్లకు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని, ఇబ్బందుల్లో ఉన్న ప్రస్తుత మిల్లులకు కూడా ఈ ప్రయోజనాలు విస్తరిస్తే ఈ రంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు

- సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేపట్టిన అనంతరమే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బిసిలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఈ అంశంపై ఈ నెల 14న విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలు, బిసి సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో అనుసరించిన విధానం మేరకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతతోందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బిల్లును కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టనుందని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సిందే

- మృతదేహాలతో సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి – నెల్లూరు

నెల్లూరు జిల్లాలోని సంగం మండలం, పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏడుగురి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం అందజేయాలని మృతదేహాలతో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యచికిత్సలు తీసుకుంటున్న కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు కారులో వెళ్తుండగా పెరమన ప్రాంతంలో ఇసుక లారీ ఢీ కొని ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న 24 గంటలు పూర్తయినప్పటికీ జిల్లా అధికారులు, ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించకపోవడంతో గుర్రాల మడుగు సెంటర్ ప్రాంతానికి చెందిన శారదమ్మ, వెంగయ్య మృతదేహాలతో బాధిత కుటుంబ సభ్యులు, సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ముత్తుకూరు గేట్ సెంటర్‌లో బైటాయించి ఆందోళన నిర్వహించారు.


మృతదేహాలతో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసులు ముత్తుకూరు గేట్ సెంటర్ ప్రాంతానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. తక్షణమే మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

సంపాదకీయం

పెండింగ్ కేసుల కొండ

పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది నానుడి. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవాయ్ వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా? అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే... మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోంది. అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు.

కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలోని ఇడి, సిబిఐ లాంటి సంస్థలు ప్రతిపక్షాలపై తరచూ అక్రమ కేసులు పెట్టడం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు బుల్‌డోజర్ న్యాయం పేరుతో అడ్డగోలుగా వ్యవహరించడం, కొన్నిసార్లు కావాలనే ప్రతిపక్షాలపై వేధింపులకు పాల్పడటం... లాంటి చర్యలు న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం, గతంలో సివిల్ తగాదాగా ఉన్న చెక్‌బౌన్స్‌ను క్రిమినల్ కేసుగా మార్చడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది. కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశించాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన కేంద్రం అనేక సందర్భాల్లో అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది.

న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేంద్రప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. 'పరివార్' సిద్ధాంతాలను వ్యతిరేకిస్తారని అనుమానం వుంటే ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయవ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటునందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది.

మహనీయుల మాట



ప్రశ్నించడం మానేస్తే బానిసత్వానికి అలవాటు పడినట్లే.

- బి.ఆర్.అంబేద్కర్, భారత రాజ్యాంగ నిర్మాత.

కేరళ లౌకిక వారసత్వాన్ని బలోపేతం చేద్దాం

వ్యాఖ్య



ఏటా జరిగే శబరిమల యాత్ర...భక్తికి, క్రమశిక్షణకు, సహోదరత్వానికి ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలంగా గుర్తింపు పొందినది. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు 70వ వార్షికోత్సవం (ప్లాటినం జూబిలీ) సందర్భాన్ని పురస్కరించుకుని 2025 సెప్టెంబర్ 25న 'అంతర్జాతీయ అయ్యప్ప సంగమం' నిర్వహించాలని, తద్వారా విశ్వజనీన విజ్ఞాపనకు, కేరళ లౌకిక వారసత్వాన్ని బలోపేతం చేసేందుకు పూనుకోవాలని నిర్ణయించారు.

శబరిమల కేవలం ఒక దేవళం కాదు. కేరళ రాష్ట్ర సామాజిక సాంస్కృతిక సమ్మిళిత తత్వానికి చిహ్నం. వారాల తరబడి దీక్షబూని స్వయం క్రమశిక్షణకు కట్టుబడి సమత్వ భావన, సమిష్టి ఆధ్యాత్మిక చింతనతో కులమతాలకు అతీతంగా లక్షలాది మంది యాత్రికులు ఈ పవిత్ర శిఖరాన్ని అధిరోహించడానికి వస్తుంటారు. అయ్యప్పస్వామి ముస్లిం సహచరుడు వావర్ నాడా ను మార్గం మధ్యలో కొలుచుకుంటారు. తద్వారా మతాతీత సామరస్యాన్ని చాటుకుంటారు. మార్గం మధ్యలోనే చారిత్రక ప్రాధాన్యత కలిగిన అర్థంకళ్ చర్చిని కూడా సందర్శిస్తారు.



ఎం.ఎ. బేబి

శబరిమల దేవళంలో నిత్యం 'హరివరాసనమ్' అన్న భక్తి గీతం వినిపిస్తూ ఉంటుంది. ఇది కూడా సమత్వానికి ప్రతీకయే. ఈ పాటను స్వరపరిచింది ఫక్తు నాస్తికవాది, కమ్యూనిస్టు అయిన జి. దేవరాజన్. ఈ పాట పాడింది జన్మత: క్రైస్తవుడయిన అత్యద్భుత గాయకుడు కె.జె. ఏసుదాసు. ఇవన్నీ శబరిమల ఆలయానికి ఉన్న లౌకిక, సామరస్య, సమ్మిళిత వారసత్వాన్ని ఎత్తిచూపుతాయి. భక్తిని మతంతో ముడిపెట్టని దేవాలయం శబరిమల.

ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చిరకాలంగా కొనసాగుతూ వస్తున్న ఈ లౌకిక సంప్రదాయాన్ని పునరుద్ధాటిస్తూ రజతోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. శబరిమల ఆలయంలో 'తత్వమసి' అన్న సూక్తం చెక్కబడి ఉంటుంది. దీని అర్థం నువ్వే నేను అని. ఎవరూ పరాయి కాదన్న భావనకు శబరిమల సంకేతం. కానీ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు దేవస్థానం బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. మతతత్వ శక్తులు ఆధిపత్యం వహిస్తున్న 'శబరిమల కర్మ సమితి' సెప్టెంబర్ 22న పంజలంలో 'విశ్వాస సంగమం' పేరిట ఒక కార్యక్రమం నిర్వహించాలని భావించింది. చారిత్రకంగా ఒక ఐక్యతా కేంద్రంగా విలసిల్లుతున్న శబరిమలలో మతతత్వ ధోరణులను చొప్పించేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇది.

> **శబరిమల కేవలం ఒక దేవళం కాదు. కేరళ రాష్ట్ర సామాజిక సాంస్కృతిక సమ్మిళిత తత్వానికి చిహ్నం. వారాల తరబడి దీక్షబూని స్వయం క్రమశిక్షణకు కట్టుబడి సమత్వ భావన, సమిష్టి ఆధ్యాత్మిక చింతనతో కులమతాలకు అతీతంగా లక్షలాది మంది యాత్రికులు ఈ పవిత్ర శిఖరాన్ని అధిరోహించడానికి వస్తుంటారు. అయ్యప్పస్వామి ముస్లిం సహచరుడు వావర్ నాడా ను మార్గం మధ్యలో కొలుచుకుంటారు. తద్వారా మతాతీత సామరస్యాన్ని చాటుకుంటారు. మార్గం మధ్యలోనే చారిత్రక ప్రాధాన్యత కలిగిన అర్థంకళ్ చర్చిని కూడా సందర్శిస్తారు.**

భక్తులకు, మతతత్వ శక్తులకు మధ్య ఉన్న భేదాన్ని గుర్తించాల్సిన తరుణమిది. భక్తులు క్రమశిక్షణతో నైతిక బలాన్ని సమానత్వ, సహోదర స్వభావాన్ని ఆశిస్తారు. మతతత్వ శక్తులు మత విశ్వాసాలను సంకుచిత రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటాయి. మత విశ్వాసులు సదా సంస్కరణలు, ప్రగతిశీల భావాల వైపే నిలవడం కేరళ చరిత్ర. శ్రీనారాయణ గురు, అయ్యంకాళి వంటి సంస్కర్తలు సమాజంలో మత సంప్రదాయాల్లో సంస్కరణలు తీసుకురావడానికి పోరాటం చేశారు. ఆ పోరాటాలు సమానత్వం, సామాజిక మార్పు, విముక్తి కోసం ఉద్దేశించినవే. 'అంతర్జాతీయ అయ్యప్ప సంగమం' కూడా ఆ సంస్కరణవాద సంప్రదాయాలను ముందుకు తీసుకుపోవాలి.

శబరిమల సంతరించుకున్న లౌకిక లక్షణాలు, శతాబ్దాల తరబడి సాగిన చర్చోప చర్చలు... సంస్కరణలు, పోరాటాల ఫలితమే. ఈ సంస్కరణలు సమాజం నుండి ఉద్భవించినవే. కులాధిపత్యం, మతతత్వ ధోరణులు బలహీన పడాలంటే ఇలాంటి సంస్కరణలు అవసరం, ఆవశ్యకం అని వామపక్షాల నిశ్చితాభిప్రాయం. అందుకే సంగమం పేరిట మతతత్వ ధోరణులను వ్యాప్తి చేసే వైఖరులను నిలవరించాలి. బిజెపి దాని అనుబంధ సంస్థలు శబరిమలను రాజకీయ లబ్ధి కోసం సాధనంగా వాడుకోవాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి. సంస్కరణలను మత విశ్వాసం మీద దాడిగా చిత్రీకరించి ప్రచారం చెయ్యడానికి తెగబడ్డాయి. శబరిమల మతతత్వ శక్తులకు ఎన్నడూ నెలవు కాదు. వివిధ కుల మతాలకు చెందిన వారిని అందరినీ కలుపుకునే సంప్రదాయం శబరిమల ఆలయానిది. ఏకపక్ష ధోరణులు, కథనాలను తిరస్కరిస్తూ వచ్చిన చరిత్ర ఈ ఆలయానిది. మతాన్ని విమర్శించే సిపిఐ(యం) పార్టీ దేవస్థానం బోర్డు నిర్ణయాలలో అనవసరంగా జోక్యం చేసుకుంటోందన్న ప్రచారాన్ని మతతత్వ శక్తులు లంకించుకున్నాయి. కమ్యూనిస్టులు సమాజంలోని ప్రతి అంశాన్ని మెరుగైన భవిష్యత్ కోసం అన్ని కోణాల నుండి తులనాత్మకంగా అధ్యయనం చేస్తారు. మతాన్ని కూడా సమాజంలో అంతర్భాగంగానే పరిగణిస్తారు. మతం అనేది అణచివేతకు గురైన జీవి నిట్టూర్పు. అది ప్రజల పాలిట మత్తు మందు అంటాడు మార్క్స్. అణగారిన ప్రజానీకం తమ కష్టనష్టాలను మరిచిపోయేందుకు మతాన్ని ఆశ్రయిస్తారన్నది మార్క్స్ భావన. బాధలను, గాయాలను మరిచిపోవడానికి వైద్యులు ఇచ్చే మత్తు మందు వంటిదే మతం.

> **భక్తులకు, మతతత్వ శక్తులకు మధ్య ఉన్న భేదాన్ని గుర్తించాల్సిన తరుణమిది. భక్తులు క్రమశిక్షణతో నైతిక బలాన్ని, సమానత్వ, సహోదర స్వభావాన్ని ఆశిస్తారు. మతతత్వ శక్తులు మత విశ్వాసాలను సంకుచిత రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటాయి. మత విశ్వాసులు సదా సంస్కరణలు, ప్రగతిశీల భావాల వైపే నిలవడం కేరళ చరిత్ర. శ్రీనారాయణ గురు, అయ్యంకాళి వంటి సంస్కర్తలు సమాజంలో మత సంప్రదాయాల్లో సంస్కరణలు తీసుకురావడానికి పోరాటం చేశారు. ఆ పోరాటాలు సమానత్వం, సామాజిక మార్పు, విముక్తి కోసం ఉద్దేశించినవే. 'అంతర్జాతీయ అయ్యప్ప సంగమం' కూడా ఆ సంస్కరణవాద సంప్రదాయాలను ముందుకు తీసుకుపోవాలి.**

అంతర్జాతీయ అయ్యప్ప సంగమం శబరిమల అభివృద్ధి ప్రాజెక్టులు, విమానాశ్రయ నిర్మాణం వంటి అనేక అంశాలు చర్చించే వేదిక. కేరళ ప్రజాక్షేత్రంలో మతతత్వ, విచ్ఛిన్న శక్తులకు తావు లేదని స్పష్టం చేసే రాజకీయ ప్రకటన. లౌకికతత్వం అనేది రాజ్యాంగ అమూర్త భావన కాదని, కేరళ యాత్రా సంప్రదాయాలలో అంతర్భాగంగా కొనసాగుతున్న సజీవ కార్యాచరణ అని విస్పష్టంగా తెలియచెప్పే వేదిక.

(వ్యాసకర్త సిపిఎం ప్రధాన కార్యదర్శి)

కవిత్వం



ఇకనైనా మేల్కొనవూ...

నీకు సిగ్గేస్తోందా
నీ వాళ్ళెవరూ
స్వాతంత్ర్య పోరులో
పాల్గొని ఎరుగరని
నీకు బెంగగా ఉందా
మువ్వన్నెల జెండాతో
ఓ ఇద్దరి చిత్రాలైనా పెట్టి
దేశమాతకు సెల్యూట్ చేయలేని
చరిత్రలో స్థానమే లేని
దీన స్థితిలో నువ్వున్నావని
అందుకే దేశభక్తి మాట నీ నోట
ఎప్పుడూ టముకేస్తూ
గొప్పలు చెప్పడం మాత్రమే
నీకు మిగిలున్న ఆయుధమని
మాతృభూమిపై ప్రేమ ఒలకబోస్తూ
మనుషుల్ని విడగొడుతూ
సాగుతున్న నీ నడక చూసి
నీకే లజ్జగా ఉంది కదూ
నిజమే మిత్రమా నిజమే
నీ దారుణ పరిస్థితి చూసి
మాకూ జాలిగానే ఉంది
ప్రతి ఇంట్లో జెండా మంచిదే
ప్రతి హృదిలోనూ సమతాభావం
మొలకెత్తించడం మరీ ముఖ్యం
అందుకే ఇకనైనా మేల్కొని
నిజమైన దేశభక్తిని
పాటించి చూపించు
నటించి కాదు.


- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

పాఠ్య పుస్తకాల్లో అసత్యాలు, వక్రీకరణలు!

కామన్ సెన్స్

దేశంలో ప్రమాదకరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయని మనకు తెలుసు. 2015-16లలో వరుసగా జరిగిన మానవవాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనాపరులైన రచయితలపై ఒత్తిళ్ల-భవిష్యత్తు చీకటిగా ఉండబోతూ ఉందని హెచ్చరిస్తూనే వచ్చాయి. అప్పటి నుండి ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. అందుకు కారణం కేంద్ర మంత్రుల ఉపన్యాసాలు, పని తీరు ఒకటైతే- వివిధ రాష్ట్రాల్లో మార్చిన ఎన్‌సిఇఆర్‌టి-సిబిఎస్ఇ పాఠ్యాంశాలు మరొక కారణం!

ఒకసారి మాజీ రక్షణ శాఖామంత్రి మనోహర్ పార్రికర్, డిఫెన్స్ రీసర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ)లోని రక్షణ శాస్త్రవేత్తలకు గొప్ప ఉపన్యాసమిచ్చాడు. ప్రాచీన భారతంలోని రుషులందరూ శాస్త్రవేత్తలేనని సెలవిచ్చారు. పురాణ గాథల్లోని పుణ్యపురుషులంతా నేటి ఆధునిక శాస్త్రవేత్తలకు ఆదర్శప్రాయులనీ, వారి వలె వీరు కూడా శాంతి స్వభావులై ఉండాలని, పనులన్నీ ఎంతో సహనంతో చేస్తూ ఉండాలని చెప్పాడు. రుషులు శాస్త్రవేత్తలేనని తను చెప్పిన విషయాన్ని వివాదాస్పదం చేయవద్దని కూడా చెప్పాడు. ముని అయిన దధీచి, ఇంద్రుడికి వజ్రాయుధాన్ని ఎలా ఇచ్చాడూ? ఆయన స్వయంగా తయారు చేశాడు గనకనే కదా, ఇవ్వగలిగాడూ? అంటే ఆయన శాస్త్రవేత్తే కదా? అన్న వివరణ కూడా ఇచ్చారు మంత్రి- వీటన్నిటికీ పరాకాష్ట ఏమిటంటే- రాందేవ్ బాబా పతంజలి యోగ పీఠానికున్న స్థాయి డి.ఆర్.డి.వో సాధించాలని కూడా ఆయన చెప్పారు! స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని దేశ భక్తులు, దేశాన్ని ఏ స్థాయికి తెచ్చారన్నది ప్రతి భారతీయుడూ ఆలోచించాల్సిన విషయం! లేకపోతే- ఒక కేంద్ర మంత్రికి, రుషికి, శాస్త్రవేత్తకు తేడా తెలియకపోవడం, యోగ పీఠానికీ రక్షణ పరిశోధనా సంస్థకూ ఉన్న తేడా తెలుసుకోక పోవడం విచారకరం కాదు, విషాదకరం!!




డా॥ దేవరాజు మహారాజు

దేశ పాలకుల ఆలోచనా సరళి ఈ విధంగా ఉన్నప్పుడు అది అన్ని శాఖల్లో, అన్ని మూలలకూ వ్యాపిస్తుంది. ఉదాహరణకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాల పాఠ్య పుస్తకాల్లో ఉన్న అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం! పదమూడు, పదిహేను సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలకు తప్పుడు సమాచారంతో పాఠాలు చెప్పడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? 1. చారిత్రాత్మకంగా ముఖ్యమైన సంవత్సరాల్ని తప్పుగా ముద్రించారు. 2. గాంధీని గాండిగా రాశారు 3. ఓడలు వెళ్లడానికి ఏర్పరిచిన సూయజ్ కాలువను సీవేజ్ కాలువగా ఇంగ్లీషు పాఠ్యపుస్తకంలో అచ్చేశారు. ఇలాంటి తప్పుల్ని ఎవరైనా ఏ విధంగా సమర్థిస్తారూ? వార్తా ఛానల్ వాళ్లు వెళ్లి సంబంధిత అధికారుల్ని ప్రశ్నించినపుడు గాంధీజీ హత్య చేయబడ్డ సమయం తేదీ అన్నీ తప్పుగా అచ్చయ్యాయనీ, సవరించాల్సి ఉందని ఒప్పుకున్నారు. గుజరాత్‌లో 70 వేల మంది విద్యార్థులు చదువుకునే సామాన్య శాస్త్ర పాఠ్యపుస్తకంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్ అమెరికాపై అణు యుద్ధం ప్రకటించిందని ఉంది. వక్రీకరించిన చారిత్రికాంశాలు చదువుకుని భావిభారత పౌరులు ఎలా తయారవుతారూ?

> **రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్య పుస్తకంలో స్త్రీలకూ గాడిదలకూ పోలిక చూపారు. ఉదయం నుండి రాత్రి దాకా స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టు కింద కాసేపు విశ్రాంతి నివ్వొచ్చుకానీ, స్త్రీలకు విశ్రాంతి నివ్వకూడదు. పాపం! గాడిదలు పారిపోయినా మళ్లీ వెంటనే దొరుకుతాయి. స్త్రీల వలె పుట్టింటికి పారిపోయే వెసులుబాటు/సౌకర్యం వాటికి లేదు కదా? అని ఆ పాఠం రాసిన రచయిత వ్యంగంగా వ్యాఖ్యానించాడు. దాన్ని కింది స్థాయి నుండి పైస్థాయి దాకా అధికారులు ఆమోదించారు. కాస్త ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయులెవరైనా ఉంటే- ఇలాంటి పాఠం ఎలా చెప్పగలరు? మనసు చంపుకుని పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా?**

స్త్రీల గౌరవాన్ని దిగజార్చే అంశాలు పాఠ్యపుస్తకాల్లో చేర్చడం వల్ల భవిష్యత్తులో మహిళల పరిస్థితి ఏమిటీ? మన సమాజం ముందుకు వెళుతోందా? లేక వెనక్కి వెళుతోందా? దేశ పౌరులుగా మనం ఆలోచించుకోవాల్సిన విషయం ఇది! రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్య పుస్తకంలో స్త్రీలకూ గాడిదలకూ పోలిక చూపారు. ఉదయం నుండి రాత్రి దాకా స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టు కింద కాసేపు విశ్రాంతి నివ్వొచ్చుకానీ, స్త్రీలకు విశ్రాంతి నివ్వకూడదు. పాపం! గాడిదలు పారిపోయినా మళ్లీ వెంటనే దొరుకుతాయి. స్త్రీల వలె పుట్టింటికి పారిపోయే వెసులుబాటు/సౌకర్యం వాటికి లేదు కదా? అని ఆ పాఠం రాసిన రచయిత వ్యంగంగా వ్యాఖ్యానించాడు. దాన్ని కింది స్థాయి నుండి పైస్థాయి దాకా అధికారులు ఆమోదించారు. కాస్త ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయులెవరైనా ఉంటే- ఇలాంటి పాఠం ఎలా చెప్పగలరు? మనసు చంపుకుని పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? ఒక పత్రికా విలేకరి సంబంధిత ఉన్నతాధికారిని అడిగితే- "ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉండడానికి అలా పెట్టి ఉంటారు లెండి!-అదో పెద్ద విషయమా?" అని ఎదురు ప్రశ్నించి తేలగొట్టేశాడు. "భార్యలు గాడిదల్లాంటి వారు" అన్న పోలికలో అతనికి ఏ తప్పు కనిపించలేదు. మరి యథా పాలకులు తథా అధికారులు. ఇక పిల్లల పాఠాల్లో ఇలాంటివి కాక, మరిక ఎలాంటివి ఉంటాయ్?

మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్‌లో హైస్కూలు విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకంలో- "దేశంలో నిరుద్యోగ సమస్యకు మూల కారణం:మహిళలు". అని ఉంది. దీనికి వివరణ ఏమంటే, మహిళలు అన్ని రంగాలలో విజృంభించడం వల్ల, అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతూ ఉండడం వల్ల, పోటీ ఎక్కువైంది.. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది-అని నిర్ధారించారు. ప్రభుత్వం వారు స్త్రీ, పురుషులందరూ పౌరులయినప్పుడు, పౌరులకు సమాన హక్కులున్నప్పుడు- అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు పనిచేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు ఎగబడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అర్థరహితంగా, అసంబద్ధంగా లేదూ? స్త్రీలను గాడిదలని, వారి వల్లే ఉద్యోగాలు లేకుండా పోయాయని.. మాంసాహారులంతా నీతిమాలిన వారని చెప్తూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటున్నది? ఈ ప్రభుత్వాన్ని ఇలాగే వదిలేస్తే రేప్పొద్దున మనుస్మృతిలోని సతీసహగమనాన్ని మళ్లీ ప్రవేశ పెడతారేమో? చెప్పలేని పరిస్థితిలో ఉన్నాం!



సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) పాఠపుస్తకంలో పది, పదకొండేళ్ల వయసు పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారుల వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెపుతారనీ, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లర్లూ, అలజడులు సృష్టిస్తారనీ- ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడతారనీ, వారికి నిజాయితీ నిబద్ధతా ఉండవని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడతారని ఉంది! ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి, పసి మనసుల్ని కలుషితం చేయడం ఏమి సబబూ? ఏ ఆహారం తీసుకుంటే ఏయే లాభాలున్నాయి? ఎందులో ఏ నష్టాలున్నాయి - అనేవి వారికి శాస్త్రీయంగా వివరించాలి. అంతే! ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకివ్వాలి. అంతే గాని-నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే అవన్నీ నిజమైపోవు కదా?

ఒక రకంగా చూస్తే, మాంసాహారులు, శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా కొన్ని దేశాల్లో, కొన్ని ప్రాంతాల్లో మాంసాహారుల సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. ఏమైనా, శాఖాహారులంతా సచ్చీలురు, సత్యవ్రతులు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదుగదా? ఈ విషయమే డైరెక్టర్‌ను అడిగితే- పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్క భాషలో విషయాలు ఒక్కో రకంగా ఉన్నాయనీ-ఒప్పుకున్నాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఎనిమిదేళ్లయినా బాలబాలికలకు చెప్పాల్సిన అంశాలపై ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవడం ఒక ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంశాలు మారుతూ ఉండడం, వక్రీకరణలు జరుగుతుండడం మరో ఘోరం!! ఆరోగ్యకరమైన మార్పులు చేస్తే ఆహ్వానించవచ్చు. కానీ, ఇక్కడ పిల్లల్ని నైతికత లేని వారిగా, బుద్ధిహీనులుగా తయారు చేసే కుట్ర జరుగుతూ ఉంది. ఈ దేశ పౌరులు ఆందోళన చెంది, కార్యాచరణకు పూనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది!


మహిళా శిశుసంక్షేమ శాఖా మాజీ మంత్రి శ్రీమతి మేనకా గాంధీ-"దౌర్జన్యాలన్నీ పురుషులవే" నని ఘంటాపథంగా సెలవిచ్చారు. అధికారం రాగానే ఇంగితం లేకుండా, లాజిక్ లేకుండా ఏదైనా మాట్లాడవచ్చా?- అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు.

ప్రభుత్వ పాలనలో ఎక్కడ ఏ లోపమున్నా ప్రశ్నించడం ఈ దేశ పౌరుల హక్కు. రాజ్యాంగాన్ని మార్చి, మనుస్మృతిని తేవాలని, దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలని, గాంధీ స్థానంలో సావర్కర్‌ను జాతిపిత చేయాలని కుట్రలు పన్నుతున్న ఈ ఆరెస్సెస్-బిజెపి ప్రభుత్వ విధానాల్ని దేశ ప్రజలు క్షుణ్ణంగా అర్థం చేసుకున్నారు. ఎక్కడికక్కడ ఎండగడుతూనే ఉన్నారు. తాజాగా ఓట్ చోరీతో వారి బండారం పూర్తిగా బయటపడింది.

రుషి పుంగవులంతా వైజ్ఞానికులే అయితే వారు శతఘ్నులు, రాకెట్లు, హెలికాప్టర్లు ఎందుకు తయారు చేయలేకపోయారు? ఆ రోజుల్లో గ్రహాంతరయానం, ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు ఎందుకు లేవూ? సైంటిస్టులు రుషుల్లా కళ్లు మూసుకుని కూర్చుంటే దేశరక్షణ జరుగుతుందా? జనాభాలో సగభాగమైన మహిళల్ని హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని ఎలా రూపొందించగలరూ? ఆలోచనా సామర్థ్యం గల నాయకుల్ని ఎన్నుకుని ఉంటే, దేశంలో పరిస్థితులు కొంత భిన్నంగా ఉండేవి. బయట సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నాం. మైనార్టీల మీద, ముఖ్యంగా ముస్లింల మీద ద్వేష భావాన్ని పెంచుతున్నారు. ఇక్కడ పాఠ్యపుస్తకాల్లో మహిళల్ని టార్గెట్ చేశారు.

అన్ని రంగాల్లో దేశ పరిస్థితి దిగదుడుపుగా ఉంది. మేధావుల సూచనలు కంఠశోషగా మిగిలిపోతున్నాయి. డబుల్ ఇంజన్ల బుల్డోజర్ నడుస్తుంటే సామాన్యుడు నలిగిపోతున్నాడు. ఏ మతమూ, ఏ భక్తి, ఏ దేవుడూ, ఏ ఆధ్యాత్మికత ఇంత తిండి పెట్టలేదు. ఏదో పని కల్పించి ఇంత జీవనాధారం చూపలేదు. ఈ దేశ పౌరులు ఇప్పటికైనా వాస్తవాలు అర్థం చేసుకుని, చదువూ వివేచనా గల యువ ప్రజా నాయకుల్ని తమ నుంచి తామే తయారు చేసుకుంటూ ఉండాలి. అందమైన అబద్ధాలు ఎదురు పడతాయి. మీద పడతాయ్!! వాటిని తోసేస్తూ, ధైర్యంగా నిజాల్ని అన్వేషిస్తూ ముందుకు కదిలేవాడే ధీరోదాత్తుడు! మనకు ఇప్పుడు అలాంటి ధీరోదాత్తులు కావాలి! వాళ్లు ఎక్కడి నుండో ఊడిపడరు. మన నుండి మనమే తయారు చేసుకోవాలి!

/ వ్యాసకర్త విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత /



అస్తవ్యస్థమవుతున్న వాటర్ సైకిల్ !

- వరదలు, కరువు మధ్య ఊగిసలాట
- ఆరేళ్ళ నుండి పెరుగుతున్న అసమానతలపై డబ్ల్యుఎంఓ నివేదిక ఆందోళన

జెనీవా : ప్రపంచ నీటి చక్రం (వాటర్ సైకిల్) రాన్రానూ అస్తవ్యస్థంగా, విపరీతంగా తయారవుతోందని, ఒకపక్క భారీ వరదలు, మరోపక్క తీవ్రమైన కరువు మధ్య ఊగిసలాడుతోందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఓ) గురువారం విడుదల చేసిన కొత్త నివేదిక పేర్కొంది. డబ్ల్యుఎంఓ సభ్య దేశాలు, అంతర్జాతీయ హైడ్రలాజికల్ మోడలింగ్ వ్యవస్థలు, ఉపగ్రహాలు పంపిన సమాచారం ప్రాతిపదికన ఈ నివేదికను రూపొందించారు.

ఆర్థికవ్యవస్థలు, పర్యావరణ వ్యవస్థలు, సమాజాలపై అధిక వర్షపాతం, అసలు వర్షాలే లేకపోవడం రెండూ కూడా తీవ్రమైన ప్రభావాన్నే కనబరుస్తాయని స్టేట్ ఆఫ్ గ్లోబల్ వాటర్ రీసోర్సెస్ 2024 నివేదిక పేర్కొంది. ప్రపంచంలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో మూడో వంతు ప్రాంతాలు మాత్రమే గతేడాది సాధారణ పరిస్థితులను కలిగివున్నాయని పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో అయితే అతి లేదా కరువు పరిస్థితులను చవి చూశాయని తెలిపింది. అత్యంత స్పష్టంగా వున్న ఈ అసమానతలు వరుసగా ఆరేళ్ళనుండి కొనసాగుతుండడం ఆందోళనకరం.

ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో హిమనదాలు విపరీతంగా కరిగిపోతున్నాయి. ఇలా జరగడం గతేడాది వరుసగా మూడో ఏడాదని డబ్ల్యుఎంఓ నివేదిక పేర్కొంది. ఇక ప్రాంతాల వారీగా చూసినట్లైతే అమెజాన్ పరీవాహక ప్రాంతం, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలు, అలాగే దక్షిణాఫ్రికాలోని కొన్ని భాగాలు తీవ్ర కరువు గుప్పిట అల్లాడుతున్నాయి. దీనికి విరుద్ధంగా, సెంట్రల్, పశ్చిమ, తూర్పు ఆఫ్రికా ప్రాంతాలు, ఆసియాలోని కొన్ని ప్రాంతాలు సెంట్రల్‌యూరప్‌ల్లో సాధారణం కన్నా అత్యంత ఎక్కువగా వర్షపాతాలు నమోదయ్యాయి. మన సమాజాలను నిలిపివుంచది, మన ఆర్థిక వ్యవస్థలకు ఊతమిచ్చేది, మన పర్యావరణ వ్యవస్థలకు ప్రాణాధారమైనది నీరే, అటువంటి జలవనరులే ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. జలసంబంధ ప్రమాదాలు, ముప్పు పెరుగుతోంది, ప్రజల జీవితాలను, జీవనోపాధులను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని డబ్ల్యుఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టె సాలో వ్యాఖ్యానించారు. నీటి కొరత ఇంకా పెచ్చరిల్లే ప్రమాదముందని నివేదిక హెచ్చరించింది. ఇప్పటికే 360కోట్ల మంది ప్రజలు ఏడాదిలో ఒక నెలన్నా సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. 2050 నాటికి ఈ సంఖ్య 500కోట్లకు చేరే ప్రమాదముందని హెచ్చరించింది.



నిరసన తెలుపుతున్న పోర్టు కార్మికులు

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, అందుకోసం పిలిచిన టెండర్లను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ..ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ప్రభుత్వ నిర్ణయం ఉందని విమర్శించారు. ఈ సంవత్సరం రూ.724.4 కోట్ల లాభాలను సొంతం చేసుకున్న విశాఖపట్నం పోర్టు రూ.171 కోట్లను పన్నుల రూపేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించినట్లు తెలిపారు. అయినప్పటికీ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటుకు అప్పగించాలని చూడటం దారుణమన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటుపరమైతే 40 వేల కుటుంబాలకు ఆరోగ్య సేవలు దూరమవుతాయని తెలిపారు.

ప్రతీ సైనికుడికి డ్రోన్ శిక్షణ

న్యూఢిల్లీ : భారత సైన్యం తన అన్ని విభాగల్లోనూ డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలను అనుసంధానిస్తోంది. ప్రతీ సైనికుడికి తన విభాగానికి ఏర్పాటు చేసే డ్రోన్లను ఆపరేట్ చేయడానికి అవసరమైన శిక్షణ పొందాలని సైన్యం భావిస్తోంది. నిఘా, పోరాటం, లాజిస్టిక్స్, వైద్య సహాయం వంటి డ్రోన్ల నిర్వహణపై శిక్షణకు ఏర్పాట్లు చేస్తోంది. 'ప్రతీ సైనికుడు ఆయుధాన్ని కలిగి ఉన్నట్లే ప్రతీ సైనికుడు డ్రోన్‌ను ఆపరేట్ చేయగలగాలి' అని ఒక సీనియర్ ఆర్మీ అధికారి తెలిపారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అరుణాచల్‌ప్రదేశ్‌లోని లికాబలిలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రోన్ శిక్షణ- ప్రయోగ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈ కేంద్రంతో పాటు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీ, మోవ్‌లోని ఇన్‌ఫ్రాంటీ స్కూల్, చెన్నైలోని ఆఫీసర్స ట్రెనింగ్ అకాడమీ వంటి కీలక శిక్షణా అకాడమీల్లోనూ డ్రోన్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సైన్యంలో డ్రోన్ల వినియోగం గురించి ఈ ఏడాది జులై 26న ద్రాస్‌లో నిర్వహించిన 26వ కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలో ఆర్మీ చీఫ్ వివరించారు. సైన్యం అన్ని విభాగాల్లోనూ డ్రోన్ సేవలు పెరుగుతాయని తెలిపారు.

భారత్‌పై మళ్లీ విషంగక్కిన ట్రంప్

- డ్రగ్స్ ఉత్పత్తి కేంద్రంగా ఆరోపణ

వాషింగ్టన్ : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ విషం వెళ్లగక్కారు. డ్రగ్స్‌కు భారత్ ఉత్పత్తి కేంద్రమనీ, భారత్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, చైనా సహా 23 దేశాలు డ్రగ్స్ రవాణా స్థావరాలుగా ఉంటూ అమెరికా ప్రజల భద్రతకు ముప్పుగా మారాయని పేర్కొన్నారు. అమెరికన్ కాంగ్రెస్‌కు సమర్పించిన 'ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్' నివేదికలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పేర్కొన్న జాబితాలో భారత్, పాకిస్తాన్, చైనా, అఫ్గానిస్థాన్, ద బహామస్, బెలీజ్, బొలీవియా, బర్మా, కొలంబియా, కోస్టారికా, ద డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హైతీ, హొండురస్, జమైకా, లావోస్, మెక్సికో, నికరాగువ, పనామా, పెరూ, వెనిజులా దేశాలు ఉన్నాయి. మాదక ద్రవ్యాలను అరికట్టడం, వాటిని ప్రేరేపిస్తున్న నేరస్థులను అదుపు చేయడంలో మరింత బలమైన చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. నైటాజీన్లు, మెథాంఫేటమిన్ వంటి ఇతర సింథటిక్ మాదకద్రవ్యాలను ప్రపంచ వ్యాప్తంగా రవాణా చేస్తున్న ప్రధాన సరఫరాదారు చైనా అని ఆరోపించారు. తాలిబాన్ డ్రగ్స్ నిషేధాన్ని ప్రకటించినప్ప టికీ మాదకద్రవ్య నిల్వలు, ఇంకా ఉత్పత్తి కొనసాగుతూనే ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఈ మాదకద్రవ్య వ్యాపారం నుంచి వచ్చే ఆదాయం ట్రాన్స్‌నేషనల్ క్రిమినల్ గ్రూప్స్‌ను ఫండింగ్ చేస్తూ అంతర్జాతీయ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ వ్యవస్థీకత నేరాల ద్వారా ఫెంటానిల్, ఇతర ప్రాణాంతక నిషేధిత మాదకద్రవ్యాలను అమెరికాలోకి రవాణా చేయడం వల్ల జాతీయ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని ట్రంప్ తెలిపారు. అదే విధంగా 18 నుంచి 44 సంవత్సరాల వయస్సు గల అమెరికన్ పౌరుల మరణానికి ప్రధాన కారణం ప్రజారోగ్య సంక్షోభం కూడా అని ఆయన పేర్కొన్నారు.

పాక్-సౌదీ రక్షణ ఒప్పందాన్ని నిశితంగా అధ్యయనం చేస్తున్నాం

- విదేశాంగశాఖ

న్యూఢిల్లీ : సౌదీ అరేబియా, పాకిస్థాన్ మధ్య కుదిరిన రక్షణ రంగ ఒప్పందాన్ని నిశితంగా అధ్యయనం చేస్తున్నామని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఈ నెల 17న ఇటీవల వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీనిపై భారత విదేశాంగ శాఖ గురువారం నాడు స్పందిస్తూ .. ఆ ఒప్పందం ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించింది. 'పాక్-సౌదీ మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందాన్ని పరిశీలిస్తున్నాం. జాతీయ భద్రతతో పాటు ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వంపై ఈ ఒప్పందం పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై అధ్యయనం చేస్తున్నాం' అని పేర్కొంది. కాగా పాక్ ప్రధాని షరీఫ్ బుధవారం సౌదీ అరేబియాలో పర్యటించారు. రియాద్‌లో యువరాజుతో ఆయన భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక, చారిత్రక సంబంధాలను, అలాగే ఉమ్మడి ప్రయోజనాలకు దోహదం చేసే అంశాలను సమీక్షించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కీలక ఒప్పందం చేసుకున్నారు. రెండు దేశాల్లో దేనిపైనైనా శత్రువు దాడి జరిపితే అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తామని, అప్పుడు ఇరువురు ప్రత్యర్థితో పోరాడాలన్నది ఆ ఒప్పందం సారాంశం.



ఉత్సవాల్లో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

దసరా సాంస్కృతికోత్సవాలు ప్రారంభం

- వివిధ కళారూపాలు ప్రదర్శించిన బృందాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ (ఎస్ఆర్‌పి) అన్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించేందుకు వివిధ అభ్యుదయ సంఘాలు, సంస్థల ఆధ్వర్యాన దసరా సాంస్కృతికోత్సవాలు విజయవాడలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. 'హింసారహిత సమాజం - పర్యావరణ పరిరక్షణ' అనే థీమ్‌పై వివిధ అంశాలను సంబంధించి విద్యార్థులు, యువతీయువకులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. థీమ్‌కు అనుగుణంగా మహిళా సమస్యలు, వివక్ష, సమానత్వం, హింస, అక్రమ రవాణా, పోర్నోగ్రఫీ, సామాజిక సమస్యలు, మాదక ద్రవ్యాలు, పర్యావరణం తదితర అంశాలను తీసుకుని కళారూపాలను ప్రదర్శించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, కోలాట దళాలు తమ కళారూపాలను ప్రదర్శించారు. ఎంబివికె, సేఫ్, తరుణి తరంగాలు, భారత మహిళా మండలి, జన శిక్షణ సంస్థాన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, స్ఫూర్తి ఆర్గనైజేషన్, ఇన్నర్ వీల్ (మిడ్జిన్), సన్‌షైన్, వన్ ఎర్త్ వన్ లైఫ్, నిర్మల మహిళా మండలి తదితర అభ్యుదయ మహిళా సంస్థలు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఐలు వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్

ఈ సందర్భంగా ఎస్ఆర్‌పి మాట్లాడుతూ దసరా అంటే విజయవాడకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మరో అతిథి ప్రముఖ రచయిత్రి వి.సత్యవతి మాట్లాడుతూ దసరా అంటేనే ఏదో తెలియని ఉత్సాహం వస్తుందని, అదే ఉత్సాహాన్ని యువతలో ఉండేలా, వారిలోని సృజనాత్మకత బయటకు తీసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే సాంస్కృతిక ఉత్సవాల్లో తొలి రోజు కోలాటం, వీధి నాటిక, బొమ్మల కొలువు, దాండియా, ఓనం, డప్పుల నృత్యం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం గవర్నర్‌పేటలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జానపద, శాస్త్రీయ నృత్యాలు, అభ్యుదయ గీతాలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 1100 మంది వివిధ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు.

ఎసిబి డిఫాల్ట్ బెయిల్ జారీ చెల్లదు

- మద్యం కేసులో సిఐడి వాదన

ప్రజాశక్తి - అమరావతి

నిర్దిష్ట గడువులోగా చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఎసిబి కోర్టు తన పరిధిని దాటి మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ్ రెడ్డి (ఎ31), కృష్ణమోహన్‌రెడ్డి (ఎ32), బాలాజీ గోవిందప్ప (ఎ33)లకు డిఫాల్ట్ బెయిల్ ఇచ్చిందంటూ హైకోర్టుకు సిఐడి తెలిపింది. సిఐడి, సిట్‌ల తరపు సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. తమ వాదనలను, ఉన్నత కోర్టుల తీర్పులను ఎసిబి కోర్టు గమనంలోకి తీసుకోలేదన్నారు. ఈ కేసులో నిందితులకు డీఫాల్ట్ బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సిఐడి వేసిన పిటిషన్లను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారించారు. చార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదనే కారణంతో నిందితులు డీఫాల్ట్ బెయిల్ కోరడానికి వీల్లేదని లూథ్రా అన్నారు. దీనిపై గోవిందప్ప తరపున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, ఎసిబి కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించకుండా చార్జిషీట్ ఆధారంగానే ముందుకు వెళ్లాలని కోరడానికి వీల్లేదన్నారు. చట్టనిబంధనలు పరిగణనలోకి తీసుకున్నకే కింది కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందన్నారు. కృష్ణమోహన్‌రెడ్డి తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ సిద్ధార్థ్ దవే వాదిస్తూ నిర్దిష్ట గడువుకు మించి నిందితులను జైల్లో ఉంచడానికి వీల్లేదన్నారు. తదుపరి విచారణను ఈ నెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

గ్రూప్ 1 మూల్యాంకనం చేయకపోతే రూ.20 లక్షలు ఎందుకు ఖర్చు చేశారు?

- పిఎస్ఆర్ ఆంజనేయులుకు హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి - అమరావతి

గ్రూప్-1 పరీక్షా పత్రాల మూల్యాంకనం చేయకపోతే 65 రోజులపాటు మంగళగిరిలోని హాయ్ ల్యాండ్ రిసార్ట్స్‌లో ఏం చేశారని, రూ.20లక్షలను ఎలా ఖర్చు చేశారని, పోలీసు సిబ్బందిని ఎలా వినియోగించారని అప్పటి ఎపిపిఎస్‌సి సెక్రటరీ పిఎస్ఆర్ ఆంజనేయులుపై హైకోర్టు ప్రశ్నలు సంధించింది. అక్రమాలు జరిగాయని సింగిల్ జడ్జి తీర్పు వెలువరించిన ఏడాదిన్నర కాలం వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించింది. మూల్యాంకనం చేయకపోతే ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తామని ఎలా ప్రకటించారని నిలదీసింది. వేల మంది నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో ముడిపడిన విషయమని తెలియదా? అని ప్రశ్నించింది. గ్రూప్ 1 నోటిఫికేషన్ మెయిన్ పరీక్షను రద్దు చేస్తూ, గత ఏడాది మార్చి 13న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎంపికైన అభ్యర్థులు వేసిన అప్పీళ్లను గురువారం న్యాయమూర్తులు జస్టిస్ బి.దేవానంద్, జస్టిస్ హరినాథ్‌శర్మ డివిజన్ బెంచ్ విచారించింది. ఎజి వాదనలు వినిపిస్తూ కమిషన్ నాటి కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యాన హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీనిపై సిట్‌తో దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. దీనికి హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, అక్కడ ఏర్పాట్లు మాత్రమే జరిగాయని అభ్యర్థుల తరపు న్యాయవాదులు చెప్పారు. సిట్ నిర్దేశించిన గడువులోగా దర్యాప్తు పూర్తి నివేదిక ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎంపిక కాని అభ్యర్థుల తరపు న్యాయవాదులు వాదిస్తూ, నిరుద్యోగులతో చెలగాటం ఆడటాన్ని అరికట్టాలని కోరారు. వాదనలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

జురెల్ సెంచరీ

- ఇండియా-ఎ 403/4
- ఆస్ట్రేలియా-ఎతో తొలి అనధికారిక టెస్ట్

లక్నో: ఆస్ట్రేలియా-ఎతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు భారీ స్కోర్ చేసింది. వికెట్‌కీపర్ బ్యాటర్ ధృవ్ జురెల్ మెరుపు శతకానికి తోడు సాయి సుదర్శన్, జగదీశన్ అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో మూడోరోజు ఆట ముగిసేసమయానికి భారత్-ఎ జట్టు 4వికెట్ల నష్టానికి 403పరుగులు చేసింది. జురెల్ 115 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. జురెల్(113)కి తోడు దేవ్‌దత్ పడిక్కల్ కూడా సెంచరీకి చేరువయ్యాడు. పడిక్కల్ 178 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 86 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. అంతకుముందు సాయి సుదర్శన్ (73), ఎన్ జగదీసన్ (64) అర్ధ సెంచరీలతో రాణించగా.. అభిమన్యు ఈశ్వరన్ (44) పర్వాలేదనిపించాడు. భారత-ఎ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8) ఒక్కడే విఫలమయ్యాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత-ఎ స్కోర్ 103 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 403 పరుగులుగా ఉంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు భారత్ ఇంకా 129 పరుగులు వెనుకపడి ఉంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఎ 532 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సామ్ కొన్‌స్టాస్ (109), వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ (123 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కగా.. క్యాంప్‌బెల్ కెల్లావే (88), కూపర్ కన్నోల్లీ (70), లియమ్ స్కాట్ (81) సెంచరీలకు చేరువై ఔటయ్యారు. కాగా, రెండు నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు, మూడు అనధికారిక? వన్డేల కోసం ఆస్ట్రేలియా-ఏ జట్టు భారత్‌లో పర్యటిస్తుంది.



13 బంతుల్లోనే అర్ధసెంచరీ

- నమీబియా ప్లేయర్ జాన్ ఫ్రైలింక్ విధ్వంసం

హరారే: అంతర్జాతీయ టి20ల్లో నమీబియాకు చెందిన జాన్ ఫ్రైలింక్ విధ్వంసం సృష్టించాడు. జింబాబ్వేతో గురువారం జరిగిన తొలి టి20లో కేవలం 13 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చిన ఫ్రైలింక్ 31బంతుల్లో 8ఫోర్లు 6సిక్సర్ల సాయంతో 77పరుగులు చేసాడు. చివర్లో ట్రంపెల్మన్ కూడా రాణించడంతో నమీబియా జట్టు 20 ఓవర్లలో 204పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో జింబాబ్వే జట్టు 176పరుగులకే కుప్పకూలింది. దీంతో నమీబియా జట్టు 33 పరుగుల తేడాతో ఘ విజయం సాధించింది. ఫ్రైలింక్ తొలి బంతి నుంచే ఎదురుదాడి మొదలుపెట్టాడు. తొలి ఓవర్‌లో వరుసగా మూడు ఫోర్లు.. రెండో ఓవర్‌లో రెండు ఫోర్లు, సిక్సర్ బాదిన అతను.. మూడో ఓవర్ గ్యాప్ ఇచ్చి, నాలుగో ఓవర్‌లో విశ్వరూపం ప్రదర్శించాడు. ట్రెవర్ గ్వాండు వేసిన ఆ ఓవర్‌లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లు సహా 26 పరుగులు రాబట్టాడు. హాఫ్ సెంచరీ తర్వాత కూడా కాసేపు మెరుపులు కొనసాగించిన ఫ్రైలింక్.. 31 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో 77 పరుగులు చేసి 9వ ఓవర్‌లో ఔటయ్యాడు. టి20ల్లో నమీబియా తరఫున అత్యంత వేగవంతమైందిగా రికార్డైంది. ఓవరాల్‌గా చూస్తే అంతర్జాతీయ టి20ల్లో ఇది మూడో వేగవంతమైన అర్ధ సెంచరీగా నిలిచింది. 2023లో దీపేంద్ర సింగ్(నేపాల్) 9బంతుల్లో, 2007లో యువరాజ్ సింగ్(ఇండియా) 12బంతుల్లోనే అర్ధసెంచరీ కొట్టారు. ఈ గెలుపుతో నమీబియా జట్టు మూడు టి20ల సిరీస్‌లో 1-0 ఆదిక్యతలో నిలిచింది.

ఢిల్లీలోనూ 42 వేల ఓట్లు తొలగింపు !

● ఇసి పై ఆప్ విమర్శ

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 42 వేల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని ఆమ్‌ఆద్మీ పార్టీ విమర్శించింది. ఆప్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ ఓట్లను తొలగించారని ఆ పార్టీ ఢిల్లీ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం తీరుపై ఇపుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను ఢిల్లీ ఎన్నికలకు ముందే తమ అధినేత అరవింద్ కేజ్రీవాల్ లేవనెత్తారని గుర్తు చేశారు. కేజ్రీవాల్ నియోజకవర్గమైన న్యూఢిల్లీలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారని తెలిపారు.

అజాం ఖాన్‌కు బెయిల్

అలహాబాద్ : భూకబ్జా కేసులో సమాజ్‌వాదీ పార్టీ నాయకులు, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి అజాం ఖాన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు గురువారం నాడు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆజాం ఖాన్‌పై నమోదైన అన్ని కేసుల్లోనూ బెయిల్ లభించడంతో జైలు నుంచి విడుదలకు మార్గం సుగమం అయింది. అయితే తీర్పు అప్‌లోడ్ చేయడం, విడుదల ఉత్తర్వు జైలు అధికారులకు చేరడం వంటి కారణాలతో విడుదలకు రెండు, మూడు రోజులు పడుతుందని న్యాయవాది మహమ్మద్ ఖలీద్ తెలిపారు. కాగా, ఈ బెయిల్ పిటిషన్‌పై ఆగస్టు 21నే వాదనలు ముగించిన హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ఏడాది మే లో ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో అజాం ఖాన్ హైకోర్టును ఆశ్రయించారు. రాంపూర్‌లోని క్వాలిటీ బార్ భూమిని ఆక్రమించారని యజమాని గగన్ అరోరా ఫిర్యాదు మేరకు 2019 నవంబర్ 21న ఈ కేసు నమోదైంది.

బోయింగ్‌పై అమెరికాలో దావా

న్యూయార్క్ : అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఘటనలో మృతులకు సంబంధించిన నలుగురు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావా వేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరును కూడా చేర్చాయి. ఈ మేరకు ఆ కుటుంబాలు దాఖలు చేసిన ఈ దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలుసని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నాయి. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్ నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపం ఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాదు.. ఆకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నివారించేందుకు ఈ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని తెలిపాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానయాన సంస్థలను హెచ్చరించలేదని పేర్కొన్నాయి. వాటిని రీప్లేస్ చేసేందుకు అవసరమయ్యే విడిభాగాలను పంపించడం లో కూడా ఈ రెండు కంపెనీలు విఫలమైనట్టు తెలిపాయి. ఈ పిటిషన్‌పై బోయింగ్, హనీవెల్ సంస్థలు ఇప్పటి వరకు స్పందించలేదు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

విద్యార్థులపై విరిగిన లాఠీ

(మొదటిపేజి తరువాయి)

దుర్మార్గమని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వెంకటేష్ విమర్శించారు. సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ నేతలు పరామర్శించారు. రాత్రి ఎనిమిది గంటలకు విద్యార్థులను స్టేషన్ నుంచి విడుదల చేశారు.

పోలీసులపై దాడి చేశారని, పోలీసు వాహనం ధ్వంసం చేశారని, హైవేపై రాకపోకలకు అంతరాయం కలిగించారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రంగప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయితో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతియుత నిరసన తెలియజేస్తున్న విద్యార్థు లు, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు దుర్భాషలాడుతూ, దాడి చేయడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఫ్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్‌లు తీవ్రంగా ఖండించారు.

నిజమైన లౌకికవాదాన్ని విశ్వసిస్తా !

● సిజెఐ జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ : అన్ని మతాల పట్ల తనకు నమ్మకముందని, అన్ని ఆరాధనా స్థలాలను సందర్శిస్తానని, నిజమైన లౌకికవాదంలో తనకు ప్రగాఢమైన విశ్వాసముందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ధ్వంసమైన విష్ణుమూర్తి విగ్రహంపై తాను చేసిన వ్యాఖ్యపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర నిరసనలు, ఖండనలు వెల్లువెత్తుతున్న తరుణంలో 48 గంటల తర్వాత గవాయ్ గురువారం తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'నేను చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో ఎలా చిత్రీకరించబడుతున్నాయో ఒకరు నాతో చెప్పారు. నేను అన్ని మతాలను నమ్ముతాను, అన్నింటినీ గౌరవిస్తాను.'' అని చీఫ్ జస్టిస్ గవాయ్ కోర్టు గదిలో చెప్పారు. అక్కడే వున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, చీఫ్ జస్టిస్ తనకు దశాబ్ద కాలం నుండి తెలుసునని, ఆలయాలతో సహా అన్ని ఆరాధనా స్థలాల్లోనూ పర్యటించడం తనకు తెలుసునని చెప్పారు. దర్గాలు, గురుద్వారాలు కూడా సందర్శించానని, తనకు నిజమైన లౌకికవాదం పట్ల నమ్మకమున్నదని పునరుద్ఘాటించారు. తాను చేసిన వ్యాఖ్యలు సందర్భానుసారం అర్ధం చేసుకోకుండా అపార్ధం చేసుకున్నారని, అందుకే ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. అయినా భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ) ఆధ్వర్యంలో గల కట్టడాల పరిధిలోని వాటిపై తామెలా ఆదేశాలు జారీ చేయగలమని ఆయన ఎదురు ప్రశ్నించారు. వక్ఫ్ కేసు ఇంకా తన మనస్సులో మెదులుతున్న సమయంలోనే ఈ పిటిషన్ విచారణకు వచ్చిందని చెప్పారు.

మధ్యప్రదేశ్‌లోని జావరి ఆలయంలో ఏడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునర్నిర్మించాలని లేదా మార్చాలని లేదా పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నెల 16న చీఫ్ జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆ ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో వుంది.

'అదాని సెన్సార్‌షిప్' పై ఢిల్లీ కోర్టు స్టే

న్యూఢిల్లీ : అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఎఇఎల్)కు సంబంధించిన వార్తలు ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా జర్నలిస్టులు, మీడియా పోర్టల్లను నిరోధిస్తూ సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఢిల్లీలోని జిల్లా కోర్టు గురువారం మధ్యంతర స్టే విధించింది. ఇలాంటి నిషేధ ఆదేశాలు ఇచ్చేముందే ప్రతివాదులైన జర్నలిస్టులకు కూడా తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని పేర్కొంది. ఎఇఎల్‌కు సంబంధించిన ధ్రువీకరణ లేని, పరువునష్టం కలిగించే కథనాలు తొలగించాలని ఈ నెల 6న ప్రత్యేక సివిల్ కోర్టు జడ్జి అనుజ్‌కుమార్ సింగ్ జారీ చేసిన ఎక్స్-పార్టే ఇంజక్షన్‌ను సవాల్ చేస్తూ జర్నలిస్టులు రవి నాయర్, అబీర్ దాస్ గుప్తా, అయస్కాంత్ దాస్, ఆయుష్ జోషి చేసిన అప్పీల్‌ను రోహిణి కోర్టు జిల్లా జడ్జి ఆశీష్ అగర్వాల్ విచారించారు. ఇలాంటి నిషేధ ఆదేశాలు జారీ చేసే ముందు ప్రతివాదులకు కూడా తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని జిల్లా జడ్జి గుర్తించారు. 'సుదీర్ఘంగా సాగిన గత విచారణలో అదానీపై కథనాలను, పోస్టులను ప్రశ్నించినప్పటికీ, నిషేధ ఆదేశాలు జారీ చేసే ముందు ప్రతివాదులకు వాదనలు వినిపించే తగిన అవకాశం ఇవ్వలేదు. నా అభిప్రాయం ప్రకారం, కథనాలు పరువు నష్టం కలిగించేవని, వాటిని తొలగించాలనే ఆదేశాలు జారీ చేసే ముందు సివిల్ జడ్జి ఆ అవకాశాన్ని మంజూరు చేసి ఉండాలి' అని జిల్లా జడ్జి తెలిపారు. అలాగే, ఏ నిర్దిష్ట కంటెంట్ పరువు నష్టం కలిగించేదో గుర్తించకుండా సివిల్ కోర్టు విస్తృత పరిధిలో నిషేధాజ్ఞలను జారీ చేసిందని జర్నలిస్టులు తమ అప్పీల్‌లో తెలిపారు.

కాగా, ఈ నెల 6 నాటి సివిల్ కోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ ఈ నెల 16న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదానీ కంటెంట్‌ను తొలగించాలని వివిధ వార్త సంస్థలను, స్వతంత్ర జర్నలిస్టులను ఆదేశించింది. ఈ నోటీసుల్లో 138 యూట్యూబ్ లింక్‌లు, 83 ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు ఉన్నాయి. తొలగింపు నోటీసులు అందుకున్న వారిలో న్యూస్‌లాండ్రీ, ది వైర్, హెచ్‌డబ్ల్యూ న్యూస్ వంటి సంస్థలు, రవిష్ కుమార్, అజిత్ అంజుమ్, థకుర్తా, ధ్రువ్ రథీ, అకాశ్ బెనర్జీ వంటి వ్యక్తులు ఉన్నారు. మెటా, గుగూల్‌లకు నోటీసు కాపీలను పంపారు.

ఎడిటర్స్ గిల్డ్ తీవ్ర ఆందోళన

అదానీ ఎంటర్‌ప్రైజెస్ పరువుకు నష్టం కలిగించే వార్తలను ప్రచురించవద్దంటూ పాత్రికేయులపై ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ఆంక్షలు విధించడాన్ని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తప్పు పట్టింది. ఆ సంస్థకు వ్యతిరేకంగా పెట్టిన యూట్యూబ్ లింకులను, ఇన్‌స్టాగ్రామ్ పోస్టులను తొలగించాలంటూ కేంద్రం ఆదేశించడాన్ని కూడా నిరసించింది. ఇలాంటి పరిణామాలు సెన్సార్‌షిప్పుకు బాటలు వేస్తాయని, భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ పరువుకు నష్టం కలిగించే వార్తలు ప్రచురించవద్దంటూ పాత్రికేయులు పరంజయ్ గుహ ఠాకూర్తా, రవి నాయర్, అబిర్ దాస్‌గుప్తా, అయస్కాంత్ దాస్, ఆయుష్ జోషీతో పాటు కొన్ని వెబ్‌సైట్లపై ఈ నెల 6వ తేదీన ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ఆంక్షలు విధించింది. కేవలం కంపెనీ వాదనలు మాత్రమే విన్న రోహిణి కోర్టు ప్రత్యేక సివిల్ జడ్జి అనుజ్ కుమార్ సింగ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పాత్రికేయులు, వెబ్‌సైట్ల వాదనలను వినకుండానే ఆయన ఎక్స్ పార్టీ ఇంజక్షన్ ఆదేశాలు ఇచ్చారు. కోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ ఈ నెల 16న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 12 వార్తా సంస్థలు, స్వతంత్ర జర్నలిస్టులకు ఆదేశాలు జారీ చేసింది. అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా ఉన్న 138 యూట్యూబ్ లింకులు, 83 ఇన్‌స్టాగ్రామ్ పోస్టులకు తొలగించాలంటూ ఆదేశించింది. నోటీసులు అందుకున్న వార్తా సంస్థల్లో న్యూస్‌లాండ్రీ, ది వైర్, హెచ్‌డబ్ల్యూ న్యూస్ కూడా ఉన్నాయి. ఈ పరిణామాలపై ఎడిటర్స్ గిల్డ్ స్పందిస్తూ ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం సెన్సార్‌షిప్పు దిశగా తీసుకున్న చర్యేనని విమర్శించింది.



ఇజుఎన్ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై వర్క్‌షాప్

కోల్‌కతా : ఎర్త్ జర్నలిజం నెట్‌వర్క్ ఆధ్వర్యంలో తీర ప్రాంత ప్రజలపై వాతావరణ మార్పులు, ఆర్థికేతర నష్టాలు అనే అంశంపై వర్క్ షాప్ కోల్‌కతాలోని సుందర్బన్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ నెల 20వ తేదీ వరకు ఈ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, కలకత్తా, వెస్ట్ బెంగాల్, కేరళ నుండి జర్నలిస్టులు హాజరయ్యారు. మెదటి రోజు ప్రారంభమైన ఈ వర్క్‌షాప్‌లో సుందర్బన్‌లో ఆర్థికేతర నష్టాల గురించి వివరించారు. పరిహారం అందని ప్రజలు ఎదురుకొనే అనేక రకాల సమస్యలు వీటి పరిధిలోకి వస్తాయి. తరచూ వచ్చే వర్షాలు, వరదలు, ఉప్పునీటి చొరబాటు, భూమి కొట్టుకుపోవడం, అడవులు నాశనం కావడం, మానవ అక్రమ రవాణా, వలసలు వంటి అంశాలపై ఆయా రంగాల్లో విశేష కృషి చేస్తున్న నిపుణులు వివరించారు. శుక్రవారం రెండో రోజు సెషన్‌లో సుందర్బన్ సెటిలెజ్ ఐలాండ్లో నివసిస్తున్న ప్రజల జీవన స్థితిగతులు, పాఠశాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పనితీరు వంటి అంశాలను పాత్రికేయులు పరిశీలిస్తారు. మూడో రోజు తమ పరిశీలనలో వచ్చిన అంశాలు పరిష్కార మార్గలపై చర్చిస్తారు.

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ

● భూతలదాడులతో భయోత్పాతం
● యుద్ధట్యాంకులను మోహరించిన సైన్యం
● భయంతో లక్షలాది మంది ప్రజల వలస



గాజా భూభాగంలో చొచ్చుకునిపోతున్న ఇజ్రాయిల్ సైన్యం

కైరో, జెరూసలేం : గాజాపై ఇజ్రాయిల్ జరుపుతోన్న అమానుష దాడుల కారణంగా అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోన్న భయం గాజా పౌరులను వెంటాడుతున్నది. హమాస్‌ను అంతం చేయటమే లక్ష్యంగా చెప్తున్న ఇజ్రాయిల్.. ఆ వంకతో గాజాపై పూర్తి పట్టుకోసం ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం అనేక అమానుష చర్యలకు పాల్పడుతున్నది. హమాస్‌పై దాడి సాకుతో ఇప్పటికే వైమానికదాడులు జరిపిన ఇజ్రాయిల్.. ఇప్పుడు భూతల దాడులతో గాజాపై విరుచుకుపడుతున్నది. గాజా నగదానికి దగ్గరగా యుద్ధట్యాంకులను మోహరింపజేసింది. తాజా చర్యలపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ఇజ్రాయిల్ చర్యలతో లక్షలాది మంది ప్రజలు నగరాన్ని వీడి బలవంతంగా తరలివెళ్లాల్సిన పరిస్థితులు అక్కడ ఏర్పడ్డాయి. వేలాది మంది ప్రజలు ప్రమాదకరమైన పరిస్థితుల్లో, ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని గాజా నుంచి దక్షిణ ప్రాంతంలోని తీర ప్రాంతాలకు తరలుతున్నారు. కాగా పాలస్తీనియన్లు గాజా నగరాన్ని విడిచి వెళ్లేందుకు ఉపయోగించుకోగల అదనపు నిష్క్రమణ మార్గాన్ని 48 గంటల పాటు తెరిచామని ఇజ్రాయిల్ సైన్యం ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. పౌరులను తరలించటం ద్వారా నగరాన్ని ఖాళీ చేయించటం, హమాస్‌ను ఎదుర్కోవటంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్టు ఇజ్రాయిల్ చెప్పింది.

లక్షలాది మంది ప్రజలు తమ సొంత నగరాన్ని వీడి వెళ్లాల్సిన పరిస్థితులు గాజాలో ఏర్పడ్డాయి. గాజా నగరంలో దాదాపు పది లక్షల మంది ఉంటారని గణాంకాలు చెప్తున్నాయి. వీరిలో ఇప్పటికే 30 నుంచి 40 శాతం మంది నగరాన్ని వీడినట్టు తెలుస్తున్నది. ఇజ్రాయిల్ తెరిచినటువంటి అదనపు నిష్క్రమణ దారి వెంట ప్రమాదాలు, భయంకరమైన పరిస్థితులు, ఆహార కొరత వంటి అనేక కఠిన పరిస్థితులు ఉండటం నగర ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నది. సొంత ప్రాంతాన్ని వీడి శాశ్వతంగా తరలివెళ్లాలా అని అనేక మంది ఆందోళన చెందుతున్నారు. "మేము గాజా నగరాన్ని వదిలి వెళ్లాలనుకున్నా.. మేము తిరిగి రాగలమని ఏదైనా హామీ ఉందా? యుద్ధం ఎప్పుడైనా ముగుస్తుందా? అందుకే నేను ఇక్కడే.. చనిపోవడానికి ఇష్టపడతాను" అని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు అహ్మద్ తెలిపారు.

65 వేలు దాటిన మరణాలు

గాజా స్ట్రిప్ వెంట ఇజ్రాయిల్ మారణహోమానికి మాత్రం ఫుల్‌స్టాప్ పడటం లేదు. ఇజ్రాయెల్ బుధవారం జరిపిన దాడులు, కాల్పుల్లో కనీసం 63 మంది మరణించారు. గాజా నగరంలో ఎక్కువ ప్రాణనష్టం సంభవించిందని స్థానిక ఆరోగ్య అధికారులు తెలిపారు. తాజా మరణాలతో ఇజ్రాయిల్ రెండేండ్లుగా జరుపుతోన్న యుద్ధంలో పాలస్తీనియన్ మరణాల సంఖ్య 65,000 దాటిందని వారు చెప్పారు. ధ్వంసమైన భవనాల శిథిలాల కింద అనేక అవశేషాలు చిక్కుకున్నందున వాస్తవ సంఖ్య ఎక్కువగానే ఉంటుందని పాలస్తీనియన్ అధికారులు, రెస్క్యూ టీం బృందాలు చెప్తున్నాయి.

కాగా గాజాపై ఇజ్రాయిల్ భూతలదాడిని పలు దేశాలు ఖండించాయి. యూరోపియన్ యూనియన్ ఇప్పటికే ఇజ్రాయిల్‌పై ఆంక్షలను విధించింది. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తోందనీ, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఐక్యరాజ్య సమితి ఓ నివేదికను సైతం అందించింది. అయినప్పటికీ అవేమీ పట్టని ఇజ్రాయిల్ అమానుష చర్యలతో పాలస్తీనియన్లను వారి సొంత ప్రాంతాల నుంచి బలవంతంగా తరలించే చర్యలకు దిగుతున్నది. హమాస్‌పై దాడుల పేరుతో అమాయకపు ప్రజలను ప్రాణాలను బలిగొంటున్నది. ఈ దాడులకు సంబంధించిన వీడియోలు, పలు దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ప్రజాస్వామ్యంపై పడిన అణుబాంబు

(మొదటిపేజి తరువాయి)

దుండగులు సాఫ్ట్‌వేర్‌ను హైజాక్ చేశారని తెలిపారు. నకిలీ అప్లికేషన్‌లు, తప్పుడు ఫోన్ నంబర్లు ఉపయోగించి ఓట్ల తొలగింపునకు అప్పీల్ చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే అవకాశమున్న బూత్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ఓట్ల తొలగింపు జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ చర్యలు తమ పార్టీని బలహీనపరచడానికి జరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అలాంటి ప్రజాస్వామ్య విధ్వంసకులను రక్షిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఓట్ల మోసంపై వంద శాతం ఆధారాలు

ఓట్ల మోసంపై వంద శాతం ఆధారాలున్నాయని ఆయన అన్నారు. కర్నాటకలో ఓట్ల మోసం జరిగిందని ఆరోపిస్తూ కొన్ని ఆధారాలను రాహుల్ గాంధీ చూపించారు. కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్న బూత్‌లలో ఈ మోసం జరిగిందని, గోదాబాయ్ పేరుతో ఫేక్ లాగిన్ ఉపయోగించి 12 ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని ఆయన తెలిపారు. ఓట్ల తొలగింపు కోసం ఆటోమేటెడ్ ప్రోగ్రామ్ ఉపయోగించారని, ప్రతి బూత్‌లో మొదటి ఓటరును దరఖాస్తుదారుగా చూపేలా చేశారని వెల్లడించారు. ఎక్కువ ఓట్లు తొలగించిన టాప్ 10 బూత్‌లన్నీ కాంగ్రెస్ పార్టీ బలమైన ప్రాంతాల్లో ఉన్న చోటనే జరిగాయని రాహుల్ తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

మహారాష్ట్ర, కర్నాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ తొలగింపులు వ్యక్తుల ద్వారా కాకుండా, ఓ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి జరిగిందన్నారు. ప్రతి బూత్‌లో మొదటి పేరును ఆ ఆటోమేటెడ్ ప్రోగ్రాం తీసుకుని తొలగించేలా రూపొందించారని తెలిపారు. అంతేకాకుండా ఈ ప్రక్రియలో రాష్ట్రానికి చెందినవారు కాకుండా ఇతర ప్రాంతాల ఫోన్లు ఉపయోగించి ఓటీపీలతో అప్లికేషన్లు దాఖలు చేసినట్టు ఆయన ఆరోపించారు. వీటి గురించి కర్నాటకలో సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈసీకి తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి 18 సార్లు ఈసీని కోరినప్పటికి శ్రద్ధ వహించలేదని చెప్పారు.

ఓటిపీల సమాచారం విడుదల చేయాలి

ఈ మొత్తం వ్యవహారం చిన్న స్థాయిలో కాకుండా, పెద్ద ఎత్తున జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ తొలగింపులపై ఎన్నికల సంఘం స్పందించకపోతే, అది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే వారిని కాపాడుతున్నట్టు అవుతుందని ఆయన హెచ్చరించారు. ఈసీ ఒక వారంలోపు తీసివేసిన ఓటర్ల వివరాలు, వాటికి ఉపయోగించిన ఫోన్లు, ఓటీపీల సమాచారం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఇది మరోసారి ఓట్ల చోరీకి నిదర్శనమవుతుందని రాహుల్ గాంధీ అన్నారు.

ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదు : ఇసి

సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఓట్లను తొలగిస్తున్నారంటూ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని పేర్కొంది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. "సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారు" అని ఈసీ పేర్కొంది.

'రాహుల్‌లో నిరాశ పెరుగుతోంది'

బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ కూడా రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందించారు. రాహుల్ గాంధీలో నిరాశ నిరంతరం పెరుగుతోందన్నారు. రాజకీయ ఆరోపణలను తన ఆభరణంగా రాహుల్ మార్చుకున్నారని వ్యాఖ్యానించారు. సీఈసీపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రశ్నించినప్పుడల్లా.. ఆయన వెనుదిరిగి పారిపోతున్నారని తెలిపారు. ఆరోపణల నేపథ్యంలో అఫిడవిట్ ఇవ్వాలని ఈసీ అడిగితే.. రాహుల్ వెనక్కి తగ్గుతారన్నారు.

యాంటీఫాపై ట్రంప్ కుయుక్తులు

● ఉగ్రవాద సంస్థగా ముద్ర
● నిధులిస్తే చర్యలు తప్పవంటూ బెదిరింపులు

వాషింగ్టన్ : అమెరికాలో మితవాదానికి, ఫాసిజం ధోరణులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యాంటీఫా గ్రూపును దెబ్బతీసేందుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుయుక్తులకు తెర లేపారు. అది ఒక ఉగ్రవాద సంస్థ అని, ఎవ్వరైనా నిధులు సమకూర్చితే దర్యాప్తును ఎదుర్కోవాల్సివుంటుందని బెదిరింపులకు దిగారు. చార్లీ కిర్క్ కాల్పుల ఘటనను ఇందుకు అతను సాకుగా పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తికి యాంటీఫాతో సంబంధముందని ఎఫ్‌బిఐ పేర్కొంది. అయితే అందుకు సాక్ష్యాధారాలేవీ చూపలేదు. దీనినే సాకుగా చేసుకున్న ట్రంప్ యాంటిఫాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించేశారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా సంస్థ అయిన 'ట్రూత్'లో పోస్టు చేశారు. 'యాంటీఫా అనేది ఒక అనారోగ్య, ప్రమాదకరమైన, అతివాద వామపక్ష సమస్య. అంతకుమించి అదో ఉగ్రవాద సంస్థ. నిధులిచ్చేవారిపై కఠిన చట్టాల కింద దర్యాప్తు చేపడుతాం' అని ట్రంప్ బెదిరించారు.

వాస్తవానికి యాంటీఫా అనేది సంస్థగా ఏమీ లేదు. 'ఫాసిజానికి వ్యతిరేకం' అని అర్థం వచ్చేలా స్థానిక యువత, కొంత మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏర్పాటు చేసుకున్న ఒక గ్రూపు మాత్రమే. మితవాద విధానాలను, ఫాసిస్ట్ చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడుతుంటుంది. కేంద్రీకృత నిర్మాణం, ప్రధాన కార్యాలయం, సభ్యత్వాలు వంటి సంస్థాగత నిర్మాణమేదీ ఈ గ్రూపునకు లేదు. అమెరికా పాలకులు అనుసరిస్తున్న మితవాద, ఫాసిస్టు తరహా విధానాలను అడ్డుకునేందుకు 2016 నుంచి ఈ గ్రూపు అజ్ఞాతంగా కార్యాకలాపాలు సాగిస్తోందని..ప్రముఖ సాహితీకారుడు 'ది యాంటి ఫాసిస్ట్' పుస్తక రచయిత మార్క్ బ్రే తెలిపారు. వామపక్ష, అభ్యుదయ శక్తులను అణిచివేయాలనే కుట్రపూరితంగానే యాంటిఫాపై ఉగ్రవాద ముద్ర వేస్తున్నారని, గతంలో ఎటువంటి తీవ్రవాద కార్యకలాపాల చరిత్ర ఆ గ్రూపునకు లేదని పలువురు విమర్శిస్తున్నారు.

ఫ్రాన్స్‌లో సమ్మెల హోరు

● సంక్షేమ నిధుల కోతపై ప్రజాగ్రహం

పారిస్ : ఫ్రాన్స్‌లో సంక్షేమ పథకాలకు, ఇతర ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలకు నిధులను భారీగా తగ్గిస్తూ చేపడుతున్న కోతల చర్యలపై ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వివిధ రూపాల్లో పోరాడిన ప్రజలు.. ప్రభుత్వం నుంచి తగిన ప్రతిస్పందన రాకపోవడంతో దేశవ్యాప్తంగా సమ్మెలకు పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పారిస్ సహా పలు నగరాల్లో శ్రమజీవులు సమ్మె చేపట్టడంతో జనజీవనం స్థంబించింది. దేశాధ్యక్షులు మాక్రాన్ ప్రభుత్వం నిధుల కోతకు ప్రణాళికలు (పొదుపు చర్యలు) రూపొందించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రవాణా స్తంభించింది. టీచర్లు, హెల్త్ వర్కర్లు, రవాణా సిబ్బంది అందరూ ఈ నిరసనల్లో చేతులు కలిపారు. గతేడాది పెన్షన్ సంస్కరణలపై జరిగిన నిరసన తర్వాత మళ్ళీ ఇంత పెద్ద ఎత్తున ప్రజా సమీకరణ జరగడం ఇదేనని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు తమ సమ్మెను అక్టోబరు వరకు వాయిదా వేసుకోవడంతో విమానయానరంగంలో ప్రభావం కనిపించలేదు. ఇంధన రంగంలో కూడా ఈ సమ్మె ప్రభావం కనిపించింది. సమ్మెకు సంఘీభావంగా కార్మికులు ఉత్పత్తిని తగ్గించడంతో అణు విద్యుత్‌లో 1.1 గిగావాట్ విద్యుత్ ఉత్పత్తి క్షీణించింది.

గత వారమే బాధ్యతలు స్వీకరించిన ప్రధాని సెబాస్టియన్ లెకొర్నుకు ఈ సమ్మె ప్రధాన పరీక్షగా నిలిచింది. గత ప్రధాని ఫ్రాంకోయిస్ బైరూ రూపొందించిన 'కోతల చర్యల ప్యాకేజీ'పై నిరసనలు వెల్లువెత్తడంతో దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని సెబాస్టియన్ హామీ ఇచ్చారు. కానీ పరిస్థితిలో పెద్దగా మార్పు ఏదీ కానరాకపోవడంతో శ్రమజీవులు ఉద్యమబాట కొనసాగిస్తున్నారు. ఫ్రాన్స్‌లోనే అతిపెద్ద టీచర్స్ యూనియన్ అయిన ఎస్‌ఎన్ఇఎస్-ఎఫ్ఎస్‌యు ప్రధాన కార్యదర్శి సోఫీ మాట్లాడుతూ, ఇలాంటి హామీలవల్ల తమ ఆగ్రహం చల్లారదన్నారు. మార్పునకు మాక్రాన్ పెద్ద అడ్డంకి అని సిజిటి యూనియన్ నేతల సోఫీ బినెట్ వ్యాఖ్యానించారు. దేశ బడ్జెట్‌లో లోటును తగ్గించాలంటే కోతలు తప్పవని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ పార్లమెంట్‌లో మెజారిటీ లేకపోవడంతో 2026 బడ్జెట్‌ను ఆమోదించడంలో ప్రభుత్వం సతమతమవుతోంది.

ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

● చమోలీ జిల్లాలో ఇద్దరు మృతి ● ఏడుగురు గల్లంతు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడుతున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం చమోలీ జిల్లాలో భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురు గల్లంతయ్యారు. నందానగర్‌లోని ధుర్మ గ్రామంలో 12 ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆరు ఇళ్లు మట్టిపెళ్లల కింద కూరుకుపోయాయి. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ చర్యలు కొనసాగించారు. అత్యవసర సేవల కోసం ప్రత్యేక వైద్య బృందం అక్కడే ఉంది. మోఖ్ నదికి వరద పోటెత్తింది. కుంత్రీ, లగాపాలీ, కుండీ, బన్స్ వాడా గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు కోల్పోయిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని అధికారులు వెల్లడించారు. కాగా, కొండచరియలు విరిగిపడిన ఘటనలో బిజెపి ఎంపి అనిల్ బలూనీ తృటిలో తప్పించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రాష్ట్రంలోని డెహ్రాడూన్, చమోలిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. డెహ్రాడూన్‌లో మంగళవారం సంభవించిన భారీ వర్షాలకు 21 మంది మరణించగా, 17 మంది గల్లంతయ్యారు. బుధవారం రాత్రి చమోలి జిల్లాలో కుంభవృష్టి సంభవించింది. ఈ ఘటనలో 10 మంది గల్లంతయ్యారు.

సామాన్యులకు 'జిఎస్‌టి' ఫలాలు

(మొదటిపేజి తరువాయి)

వస్తుందన్నారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. సంపద సృష్టించని వారికి సంక్షేమ పథకాలు ఇచ్చే అధికారం లేదన్నారు. అప్పులు చేసి సంక్షేమం ఇవ్వడం సరికాదన్నారు. జిఎస్‌టి అమలులో గతంలో నాలుగు అంచెల పన్నుల వ్యవస్థ ఉండేదని, తాజా సంస్కరణలలో దీనిని రెండెంచెల వ్యవస్థగా మార్చారని ఆయన తెలిపారు.. ఈ సందర్భంగా సిఎం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిఎస్‌టి సంస్కరణలను విపులంగా వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ జిఎస్‌టి సంస్కరణల వల్ల పన్నుల విధానం సులభతరం అవుతుందన్నారు. రాష్ట్రానికి ఆదాయం తగ్గుతున్నా చంద్రబాబు నాయుడు, తాను సంపూర్ణంగా మద్దతు ఇచ్చామన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ వేల రకాల వస్తువుల ధరల తగ్గుదల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఉదారంగా స్పందించినందుకు సిఎంను అబినందిస్తూ తీర్మానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ అంశంపై ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, మాధవి రెడ్డి, కూన రవికుమార్, బూర్ల రామాంజనేయులు తదితరులు మాట్లాడారు.

పార్లమెంట్ ఇ-మెయిల్ వ్యవస్థ ప్రయివేటుపరం

(మొదటిపేజి తరువాయి)

సంబంధించిన డేటా మొత్తం ప్రైవేటు సంస్థ చేతుల్లోకి వెళ్లిపోతుందని, ఆయా ఇ-మెయిళ్లకు వచ్చిన ఇన్‌బాక్స్ సందేశాలను కూడా తెరిచి, వాటిని యాక్సెస్ చేసే అవకాశం కల్పించినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చిందని ఆయన పేర్కొన్నారు.'పార్లమెంట్ సభ్యుల అధికారిక సంసద్ ఇ మెయిల్ వ్యవస్థను కొత్త ఫ్రేమ్‌వర్క్ కిందకు తీసుకువచ్చారు. ఇకపై జోహో నిర్వహించే కొత్త వెబ్‌సైట్ అడ్రస్‌ను, అలాగే బహుళ అంశాల ప్రామాణీకరణ కోసం జోహో అభివృద్ధిపరిచిన 'వన్‌ఆథ్' అప్లికేషన్‌ను పార్లమెంట్ సభ్యులు ఉపయోగించాలని ఎన్ఐసి ఆదేశించింది' అని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు నిర్వహించే అన్ని రకాలైన అధికారిక లావాదేవీలు వారి ఇ-మెయిల్ ఖాతాల్లో వుంటాయి. అలాగే సున్నితమైన డాక్యుమెంట్లను కూడా వారు పంచుకుంటారు. ముసాయిదా బిల్లులను పంపిస్తారు. రాజ్యాంగ అధికారులతో మాట్లాడిన విషయాలు వుంటాయని బ్రిట్టాస్ చెప్పారు. "ఇటువంటి కమ్యూనికేషన్లు ప్రైవేటు వ్యక్తుల నియంత్రణలో వుండే బ్యాకెండ్ ఆపరేషన్ల ద్వారా, అలాగే ప్రైవేటు సంస్థ నిర్వహించే ఒక ప్రామాణీక వ్యవస్థ ద్వారా వెళ్ళడం వల్ల చట్టసభ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడే ముప్పు పొంచి వుంది' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఆధునీకరణ, మార్పు జరగాల్సిన స్థాయి (స్కేలబిలిటీ), సైబర్ భద్రత వంటి కారణాలను చూపుతూ ఈ చర్యను ప్రభుత్వం సమర్థించుకోవడానికి చూస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. 'కానీ, అంతకన్నా పెద్ద ప్రశ్న ఒకదానికి సమాధానం లభించలేదు. వ్యవస్థాగత స్వాతంత్ర్యాన్ని దెబ్బతీయకుండా పార్లమెంట్‌తో సహా ప్రభుత్వ కమ్యూనికేషన్ వ్యవస్థల సంరక్షణ బాధ్యతలను ఒక ప్రైవేటు సంస్థ ద్వారా నిర్వహించవచ్చా? ఎన్ఐసి లేదా ఇందుకు సంబంధించిన మరే ఇతర ప్రభుత్వ సంస్థల అవసరాలకు అనుగుణంగా నిపుణులను, మౌలిక సౌకర్యాలను పెంచడంలో ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నది ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

మండలిలో నిరసనలు

(మొదటిపేజి తరువాయి)

మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. చర్చించాలని డిమాండ్ చేస్తూ సభ్యులు వెల్ నుంచి చైర్మన్ పోడియం పైకి చేరుకొని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో సభ ప్రారంభమైన పది నిమిషాల్లోనే చైర్మన్ కొంతసేపు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమయిన తరువాత కూడా వైసిపి సభ్యులు ఇదే అంశాన్ని లేవనెత్తారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మరోసారి స్పష్టం చేశారు. శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే ఇప్పుడు చర్చించాలని, వాయిదా వేయాల్సిన అవసరం లేదన్నారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చించేందుకు ఒప్పుకుందని, ఈ అంశంపై బిఎసిలో నిర్ణయం తీసుకుందామని చెప్పారు. తిరుపతి, సింహాచలం దేవస్థానాల్లో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైసిపి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ రెండు ఘటలనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలని వైసిపి సభ్యులు రామసుబ్బారెడ్డి, వరుదు కళ్యాణి, కెఆర్‌జె భరత్ దేవదాయ శాఖమంత్రి ఆనం రామానారాయణ రెడ్డిని అడిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శ పేరుతో స్విమ్స్ ఆస్పత్రిలో దాడి చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. ఈ తొక్కిసలాట ఘటనలకు బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి సభ్యులు ఆందోళనలు చేశారు. ఇదే సమయంలో టిడిపి సభ్యులు కూడా నినాదాలు చేశారు. పోటాపోటీ నినాదాల మధ్య చైర్మన్ సభను కొంతసేపు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత కూడా మంత్రి రాజీనామా చేయాలని వైసిపి డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనలలను తప్పు జరిగిందని చెబుతున్న ప్రభుత్వం చర్యలు మాత్రం తీసుకోవడం లేదని అన్నారు. ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని, ఇందుకు నిరసనగా తాము సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని సభ నుంచి అందరూ బయటకు వచ్చారు.


కుటుంబ సభ్యులతో క్రీడాకారులు

వారంతా కృష్ణానది తీరంలో పుట్టి పెరిగిన వారే. తమ తండ్రులే గురువులుగా, నదినే శిక్షణా కేంద్రంగా ఎంచుకుని నిరంతరం మెళకువలు నేర్చుకుంటూ రాష్ట్రస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి జలక్రీడల పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఓ వైపు చదువును సమాంతరంగానే కొనసాగిస్తూ జలక్రీడల్లో అత్యంత నిపుణత ప్రదర్శిస్తున్నారు. నచ్చిన క్రీడలో రాణిస్తేనే క్రీడాకారులుగా మంచి స్థానంలో నిలవగలమనేది వారి లక్ష్యం. జలక్రీడలకు సరైన వసతులు లేకపోయినా చెక్కబోట్లతోనే నేర్చుకుంటూ అత్యుత్త ప్రతిభ కనబరుస్తున్నారు నాగిడి గాయత్రి, శ్యాము, భార్గవి, రాజేష్, అశ్వని; కన్నా ఈశ్వర్, కుమార్. ఈ ఏడుగురూ ఒకే కుటుంబ సభ్యులు. జలక్రీడల్లో నిరంతర సాధకులు.

మాస్టారు చెప్పిన మంచి మాటలు!



అది ఐదవ తరగతి. తెలుగు మాస్టారు భాస్కర్ పాఠం చెప్పడానికి వచ్చారు. 'సార్! నా పుస్తకాల సంచిలో నుంచి ఎవరో పెన్నును దొంగిలించారు' అని చెప్పాడు రవి. 'అలాగా.. పిల్లలూ పాఠానికి ముందు కొన్ని మంచి మాటలు వినండి.. పెన్ను దొంగతనం చేయడం నేరం. ఈ దొంగతనం చేసిన విద్యార్థిని తరగతి వారే కాకుండా పాఠశాల మొత్తం దొంగ అని ముద్ర వేస్తుంది' అన్నారు మాస్టారు.

'అవునా సార్!' అన్నాడు కిరణ్ అనే విద్యార్థి.

'ఇంకో విషయం మీకు తెలియదనుకుంటా.. దొంగ అని ఆ విద్యార్థిని నిర్ధారించాక మన ప్రధానోపాధ్యాయుల వారు అతడికి బదిలీ పత్రంతో పాటు, ప్రవర్తనా పత్రం కూడా ఇస్తారు. అందులో ఈ పిల్లవాడి ప్రవర్తన మంచిది కాదని రాస్తారు. దానితో అతణ్ణి ఏ పాఠశాల వారూ చేర్చుకోరు' అన్నారు మాస్టారు.


'ఇంత విషయం ఉందా సార్' అన్నాడు కృష్ణ అనే విద్యార్థి. 'అవును. దొంగతనం చేసిన వారు ఆ పెన్నును నాకు ఇక్కడే ఇవ్వనవసరం లేదు. నా విశ్రాంతి గదికి వచ్చి ఇస్తే అతని పేరును నేను ఎవ్వరికీ చెప్పను' అని పాఠం చెప్పి వెళ్ళిపోయారు. విశ్రాంతి గదికి శంకర్ అనే విద్యార్థి వెళ్లి 'సార్! పెన్ను నేనే దొంగతనం చేశాను. మీ మాటలు నన్ను ప్రభావితం చేశాయి. ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయను క్షమించండి సార్!' అన్నాడు ఎంతో బాధగా. 'నీలో మంచి ప్రవర్తన వచ్చినందుకు చాలా సతోషం. ఇదిగో ఈ పెన్ను నీకు బహుమతిగా ఇస్తున్నాను' అని మాస్టారు తన వద్ద ఉన్న పెన్నును ఇచ్చారు. తరువాత మాస్టారు, రవిని పిలిచి పోయిన పెన్ను ఇచ్చారు. మరెప్పుడూ తరగతి గదిలో ఎలాంటి దొంగతనం జరగలేదు.

- యు.విజయశేఖర రెడ్డి, హైదరాబాద్.


లెక్క కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి.

జవాబు : 35



నేను గీసిన బొమ్మ





ఎం.వర్షిత
4వ తరగతి, ఎంపియుపి స్కూల్, పి.నైనవరం, విజయవాడ రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జల క్రీడల్లో జయకేతనం!

కృష్ణా జిల్లాలో తీర మండలమైన నాగాయలంకకు చెందిన పలువురు విద్యార్థులు చదువుతోపాటు జల క్రీడల్లోనూ రాణిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేని వారు నిరూపిస్తున్నారు. వారిలో నాగిడి గాయత్రి అంతర్జాతీయ క్రీడాకారిణి. నాగిడి భార్గవి, నాగిడి రాజేష్, నాగిడి శ్యాము, నాగిడి అశ్వని, కన్నా కుమార్, కన్నా ఈశ్వర్ రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. వీరంతా నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో సాధన చేస్తూ పలు రకాల జలక్రీడల్లో ప్రతిభ చూపారు. జల క్రీడల అకాడమీలో 2018 నుంచి శిక్షణ పొందుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ పలు బహుమతులను కైవసం చేసుకుంటున్నారు. చిన్నతనం నుంచే తండ్రుల వెంట చేపల వేటకు వెళ్లే వీరు ఆ క్రమంలో ఈతకొట్టడం నేర్చుకున్నారు. చేపల వేటలో మెళకువలతో పాటు పడవ నడపటం దగ్గర నుంచి ఒడుపుగా లంగరు వేయటం వరకూ తండ్రుల నే గురువులుగా ఎంచుకుని నేర్చుకుంటున్నారు. చదువుకుంటూనే తమ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు



నాగిడి శ్యాము : నాగాయలంకలోని స్కాలర్స్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. 34వ జాతీయ కానోల్ స్ప్రింట్ జూనియర్ మెన్ అండ్, సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గరల్స్ చాంఫియన్‌షిఫ్-(బోఫాల్) 2023-24లో పాల్గొన్నాడు. 12వ జాతీయ డ్రాగన్ బోట్ చాంఫియన్‌షిఫ్ 2023-24 (బోఫాల్)లో సీనియర్ అండ్ జూనియన్‌షిఫ్ పోటీల్లో పాల్గొన్నాడు. రెండో ఎపి అంతర్ జిల్లా సబ్ జూనియర్, సీనియర్ కానోయింగ్, కయాకింగ్, కానోస్లాలమ్, డ్రాగన్ బోట్ చాంఫియన్‌షిఫ్- నంద్యాలలో రెండోస్థానం సాధించాడు. కయాకింగ్‌తోపాటు తైక్వాండో పోటీల్లో పలు పతకాలు కైవసం చేసుకున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన గాయత్రి



నాగాయలంకకు చెందిన నాగిడి నాగబాబు, వెంకట నాగేశ్వరమ్మల దంపతుల రెండో కుమార్తె గాయత్రి జలక్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. ప్రస్తుతం బాపట్ల జిల్లా నగరంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక డిగ్రీ కళాశాల బిసిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆమె జాతీయ స్థాయిలో బంగారు 1, సిల్వర్ 7, రాష్ట్రస్థాయిలో పలు బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడళ్లు సాధించారు. రాబోయే ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌ల్లో పాల్గొని బంగారు పతకాలు తేవటమే లక్ష్యంగా ఆమె కృషి చేస్తున్నారు. కోచ్‌గా ఎపి స్టేట్ వాటర్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ బలరామ్ నాయుడు, డిఎస్‌డిఒ ఝాన్సీ లక్ష్మి ప్రోత్సాహం అందిస్తున్నారు. ఏషియన్ గేమ్స్‌కు వెళ్లేందుకు కళాశాల కరస్పాండెంట్ వి.బుచ్చయ్య చౌదరి సహకరించారు.



కన్నా ఈశ్వర్ : విజయవాడ ఎఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కయాకింగ్‌తో పాటుగా తైక్వాండోనూ పలు పోటీల్లో విజేతగా నిలిచాడు. 9వ నేషనల్ కెనోపోలో చాంఫియన్‌షిఫ్‌లో జూనియర్ విభాగంలో రజితం, సీనియర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించాడు. జాతీయ పోటీల్లో పాల్గొంటున్నాడు. రాష్ట్రస్థాయిలో 3 స్వర్ణ, 2 రజిత, ఒక కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



నాగిడి భార్గవి : విజయవాడలోని గురుకుల కళాశాలలో ఎంఇసి (సిఎ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగిడి భార్గవి కయాకింగ్, కెనోయింగ్ అండ్ రోయింగ్ పోటీల్లో పలు పతకాలు సాధించారు. మధ్యప్రదేశ్‌లో 2022 డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కెనోస్లాలం సీ1 పోటీల్లో 4వ స్థానం, విజయవాడలో 2022లో రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో కాంస్య, మధ్యప్రదేశ్‌లో 2023 ఫిబ్రవరిలో ఖేల్ ఇండియా కెనోస్లాలం సీ1 పోటీల్లో 4వ స్థానం, జమ్మూకాశ్మీర్‌లో ఏషియన్ సెలక్షన్స్‌లో వరుసగా సీ1 3వ, 6వ స్థానాల్లో నిలిచింది. గోవాలో 37వ జాతీయస్థాయి ఆటల్లో నాల్గో స్థానం, రెండో జాతీయ కయాకింగ్ కానోయింగ్ స్టేట్ చాంఫియన్‌షిఫ్‌లో రెండో స్థానంలో నిలచారు.



కన్నా కుమార్ : విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాడు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నాడు. తైక్వాండో పోటీల్లో పలుసార్లు విజేతగా నిలిచాడు. ఇండోర్‌లో రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో స్వర్ణం సాధించాడు. 33వ జాతీయ కెనోస్ప్రింట్, 15వ ఇండోర్ రోయింగ్ చాంఫియన్‌షిఫ్‌లో పాల్గొన్నాడు. మొదటి ఎన్టీఆర్ మెమోరియల్ ఎపి స్టేట్ తైక్వాండో చాంఫియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ తైక్వాండో చాంఫియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చారు.



నాగిడి రాజేష్ : గుంటూరు ఎన్‌ఆర్‌ఐ ఐటి పాలిటెక్నికల్‌లో డిప్లమో చదువుతూ హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. ఢిల్లీలో 2020లో జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ తైక్వాండోలో బంగారు పతకం. 12వ జాతీయ కానోల్ స్లామ్ సీనియర్ మెన్ చాంఫియన్‌షిఫ్‌గా నిలిచారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పలు పతకాలను అందుకున్నారు. ఆగస్టు 2025లో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఖేల్ ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో కెనోల్‌స్లాలమ్‌లో రజత పతకం సాధించాడు.



నాడిగి అశ్విని : నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బోటింగ్, ఈత పోటీల్లో చురుగ్గా పాల్గొంటుంది. 37వ జాతీయ పోటీలు (గోవా) -2023లో పాల్గొంది. అదే ఏడాది విజయవాడలో జరిగిన ఈత పోటీల్లో రెండోస్థానంలో నిలిచి రజిత పతకం సాధించింది. ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పాఠశాలల స్థాయి ఈత పోటీల్లో ఐదోస్థానంలో నిలిచింది. 2024లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఈతపోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది.

సినీ కార్మికుల బాధ్యత నాదే!

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న తెలంగాణ సిఎం రేవంత్



'చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో హైదరాబాద్‌ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నాం. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులు తమ సమస్యలపై చర్చించుకుని ఏమి కావాలో ప్రభుత్వానికి తెలియజేస్తే చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తాం. ఇటీవల నిర్మాతలతో జరిగిన సమావేశంలో సినిమా కార్మికులను విస్మరించొద్దనీ, వారిలో నైపుణ్యాల పెంపునకు సహకరించాల్సిందిగా కోరా. నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించాం. అందుకోసం స్కిల్స్ యూనివర్శిటీలో శిక్షణ అందించే కార్యక్రమం చేపడతాం. అన్ని భాషల చిత్రాలు తెలంగాణలో షూటింగ్ జరిగేలా అందరూ సహకరించాలి. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలకు సహకరించాలని కోరుతున్నా. పరిశ్రమలో సానుకూల పని వాతావరణాన్ని చెడగొట్టుకుని సమ్మెలకు వెళ్లడం వల్ల రెండు వైపులా నష్టం జరుగుతుందనేది నా అభిప్రాయం. కార్మికుల తరపున నిర్మాతలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ప్రభుత్వం సమస్యలను సమస్యలు గానే చూస్తుంది. వ్యక్తిగత పరిచయాలు ప్రధానం కాదని స్పష్టం చేస్తున్నా. కార్మికుల సమస్యలను పరిష్కరించే బాధ్యతను నేను తీసుకుంటా. కార్మికుల పక్షాన అండగా ఉంటా. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని కోరుతున్నా. సమ్మె జరుగుతుంటే ప్రభుత్వం నిర్లిప్తంగా ఎలా ఉంటుంది. ఖచ్చితంగా స్పందిస్తుంది. అంతకుముందు పదేళ్ల పాటు సినిమా రంగంలో అవార్డులు ఇవ్వని విషయం మీకు తెలియంది కాదు. మా ప్రభుత్వం సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ఇటీవల బహూకరించిన విషయాన్ని గుర్తుచేస్తున్నా. కార్మికులకు ఆరోగ్య బీమా అందించే ప్రయత్నం కూడా చేస్తాం. ఉమ్మడి సమావేశంలో నిర్ణయించిన అంశాలు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి నోచుకుంటాయి. ఎవ్వరూ అధైర్యపడొద్దు' అని తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలుగు సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు గతంలో నిర్మాతల మండలి ఇచ్చిన హామీమేరకు 30 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4 నుంచి 21 వరకూ పోరుబాట కొనసాగించగా, 22.5 శాతం పెంపుతో అంగీకారం లభించింది. మిగతా పెండింగ్ డిమాండ్ల కోసం నిర్మాతలు, కార్మికులతో ప్రత్యేకంగా చర్చిస్తానన్న సిఎం రేవంత్ అదే నెల 25న నిర్మాతల మండలితో భేటీ అయ్యారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆలిండియా ఫిలిం ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్- యుఎన్ఐ-ఎంఇఐ అనుబంధం) ఆధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్) తదితరులతో 24 క్రాఫ్ట్‌ల్లో పనిచేసే కార్మిక సంఘాల ప్రతినిధులు బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. గడిచిన ఎన్నో ఏళ్లుగా సినిమా కార్మికులను పిలిచి మాట్లాడిన ముఖ్యమంత్రి లేరన్న సంగతిని ఈ సందర్భంగా సంఘాల నాయకులు వివరించారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజుతో మరికొందరు నిర్మాతలు కూడా పాల్గొన్నారు.





సత్య దాదాగా ప్రకాష్ రాజ్

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా, ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటించిన చిత్రం 'ఓజీ'. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి కీలక పాత్ర పోషించారు. సుజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈనెల 25న విడుదల కానుంది. త్వరలో ట్రైలర్ కూడా విడుదల కానుంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్ సత్య దాదాగా ప్రకాష్‌రాజ్ నటించారు. ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇందులో ప్రకాష్‌రాజ్... శాలువా కప్పుకుని, కళ్లజోడు పెట్టుకుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుగా ఉన్నారు. ఆయన పాత్ర పేరును సత్య దాదాగా ప్రకటించారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించారు.

20న యాక్టింగ్ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్ బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళలశాఖ ద్వారా 'ఎంపిఎ (థియేటర్ ఆర్ట్స్) యాక్టింగ్' కోర్సులో ప్రవేశానికి ఈనెల 20న స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఈకోర్సు పూర్తిచేసిన 10 మంది విద్యార్థులు తెలంగాణా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం సెల్ : 93464 61733లో సంప్రదించాలని కోరారు.

నేడు 'బ్యూటీ' సినిమా విడుదల

ఎ.మారుతి టీం ప్రొడక్ట్, వానరా సెల్యూలాయిడ్, జీ స్టూడియో బ్యానర్లపై విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మించిన చిత్రం 'బ్యూటీ'. అంకిత్ కొయ్య, నీలఖి, నరేష్, వాసుకి ప్రధాన పాత్రల్లో నటించారు. కథ, స్క్రీన్‌ప్లే ఆర్.వి.సుబ్రహ్మణ్యం అందించారు. జెఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహించారు. శుక్రవారం ఈ సినిమా విడుదల కానుంది. నిర్మాత విజయ్‌పాల్‌రెడ్డి మీడియాతో ముచ్చటించారు. "బ్యూటీ' టైటిల్ ఎంతో క్యాచీగా ఉండటంతో జనాల్లోకి ఎక్కువగా వెళ్లింది. పాటలు, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు మనసుని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. ప్రతి మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చూడాల్సిన చిత్రంగా మా 'బ్యూటీ' నిలుస్తుంది. పిల్లలు, తల్లిదండ్రులు ఇలా అందరూ కలిసి చూడదగ్గ చిత్రం. నాకు పర్సనల్‌గా ఎమోషనల్ సీన్స్ అంటే ఇష్టం. ఈ కథలోని ఎమోషన్స్ నచ్చే నిర్మించేందుకు ముందుకు వచ్చాను. ఈ కథ విన్న వెంటనే ఈ మూవీని చేద్దామని మారుతికి చెప్పాను. జీ స్టూడియో సహకారం వల్లే మా సినిమాను ప్రతి ఒక్కరికీ రీచ్ చేయగలిగాం. దాదాపు 150 థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం' అని అన్నారు.

కుర్రాళ్లకు సదవకాశం

- నేడు ఒమన్‌తో టీమిండియా చివరి లీగ్ మ్యాచ్
- శ్రీలంక చేతిలో ఓటమితో ఆఫ్ఘన్ ఔట్.. సూపర్-4కు బంగ్లాదేశ్



దుబాయ్: ఆసియాకప్ సూపర్-4 బెర్త్‌లు ఖరారయ్యాయి. గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్తాన్, గ్రూప్-బి నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు చేరాయి. గురువారం జరిగిన నిర్ణయాత్మక చివరి లీగ్ మ్యాచ్‌లో ఆఫ్ఘన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో శ్రీలంక చేతిలో ఓటమిపాలైంది. దీంతో బంగ్లాదేశ్‌కు అదృష్టం కలిసొచ్చి సూపర్-4కు చేరగా.. చివరి వరకు పోరాడినా ఆఫ్ఘన్‌కు ఫలితం దక్కలేదు. శుక్రవారం భారత్-ఒమన్ జట్ల మధ్య జరిగే చివరి మ్యాచ్‌తో 2025 ఆసియాకప్ టోర్నీ లీగ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందే ఆతిథ్య యుఎఇతోపాటు ఒమన్, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

ఇక ఆసియాకప్ టోర్నీలో భారతజట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి లీగ్‌లో యుఎఇపై 9వికెట్ల తేడాతో, పాకిస్తాన్‌పై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారతజట్టు చివరి లీగ్ మ్యాచ్‌ను విజయంతో ముగించాలని చూస్తోంది. బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పటిష్టంగా ఉన్న టీమిండియాను ఒమన్ నిలువరించడం కష్టమే. ఈ లీగ్‌లో ఆ జట్టు ఆడిన రెండు మ్యాచు ల్లోనూ చిత్తుగా ఓడి టోర్నీనుంచి ఇప్పటికే నిష్క్రమించింది.

పోరాడి ఓడిన ఆఫ్ఘనిస్తాన్

శ్రీలంకతో గురువారం జరిగిన కీలక పోరులో ఆఫ్ఘనిస్తాన్ జట్టు చివరి వరకు పోరాడి ఓటమిపాలైంద. తొలుత సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ ఇన్నింగ్స్ చివరి ఓవర్లు ఏకంగా ఐదు సిక్సర్లు బాదడంతో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 169పరుగుల చేసింది. ఛేదనలో భాగంగా శ్రీలంక 18.4ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి గెలిచింది. ఆఫ్ఘన్ జట్టు 79పరుగులకే 6వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ దశలో రషీద్ ఖాన్(24), నబీ కలిసి జట్టును ఆదుకున్నారు. నబీ 22 బంతుల్లో 3ఫోర్లు, 6సిక్సర్ల సాయంతో 60 పరుగులు చేసి చివర్లో రనౌటయ్యాడు. శ్రీలంక బౌలర్లు తుషారాకు నాలుగు, ఛమీరా, వెల్లలాగే, శనకకు ఒక్కో వికెట్ దక్కాయి.

సచిన్‌కు చేజారిన కాంస్యం

ఫైనల్లో నిరాశపరిచిన నీరజ్ చోప్రా
ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో సచిన్ యాదవ్ తృటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకోగా.. స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఫైనల్లో నిరాశపరి 8వ స్థానానికే పరిమితమయ్యాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన నీరజ్.. గురువారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో 85 మీటర్ల మార్క్‌ను అందుకోలేకపోయాడు. ఐదు ప్రయత్నాల్లోనూ ఆ మార్జిన్‌ను చేరుకోలేక పోయాడు. ఈ ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో రజత పతకంతో మెరిసిన సచిన్ యాదవ్ మాత్రం అదరగొట్టాడు. నీరజ్ జావెలిన్‌ను 85 మీటర్ల దూరం విసరలేకపోయిన చోట సచిన్ ఏకంగా 86 మీటర్ల మార్క్ అందుకొని అబ్బురపరిచాడు. కానీ.. 86.27 మీటర్లతో నాలుగో స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. గత ఏడేళ్లలో పోటీపడిన ప్రతి ఈవెంట్లో పతకం కొల్లగొట్టిన చోప్రా.. ఈసారి పతకం లేకుండా తిరుగు పయనమయ్యాడు. ఇక ట్రినిడాడ్ వీరుడు కెషార్న్ వాల్‌కాట్ స్వర్ణం కొల్లగొట్టాడు. ఫైనల్లో అతడు 88.16 మీటర్ల దూరం ఈటెను విసిరి అగ్రస్థానంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ 87.36 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా.. అమెరికా అథ్లెట్ కర్టిస్ థాంప్సన్ 86.67 మీటర్ల దూరంలో కాంస్యం గెలుపొందాడు. పారిస్ ఒలింపిక్స్‌లో 90 మీటర్లతో స్వర్ణ పతకం సాధించిన పాక్ అథ్లెట్ అర్షాద్ నదీమ్ సైతం పేలవ ఫామ్(82.75)తో పదో స్థానానికి పరిమితమయ్యాడు.

క్వార్టర్స్‌కు సింధు

సాత్విక్-చిరాగ్‌శెట్టి జోడీ కూడా.. చైనా మాస్టర్స్ టోర్నీ



లీ-నింగ్(చైనా): చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి పివి సింధుతోపాటు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జంట ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో సింధు 21-15, 21-15తో మలేషియాకు చెందిన 6వ ర్యాంకర్ పోర్న్‌పోవేను చిత్తుచేసింది. క్వార్టర్‌ఫైనల్లో సింధు టాప్‌సీడ్, కొరియాకు చెందిన అన్-సే-యంగ్‌తో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లోనూ భారత షట్లర్ల హవా కొనసాగుతోంది. ప్రిక్వార్టర్స్‌లో చిరాగ్-సాత్విక్ జంట చైనీస్ తైపీ జోడీపై వరుససెట్లలో విజయం సాధించింది. ప్రి క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 21-13, 21-12తో ముగించారు. 8వ ర్యాంకర్‌గా బరిలోకి దిగిన భారత జంట క్వార్టర్‌ఫైనల్లో చైనా ద్వయంతో తలపడనున్నారు.

పుణేరి, జైపూర్ గెలుపు

జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్-12 పోటీలో హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్టు 45-41 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేసింది. జైపూర్ రైడర్ నితిన్(13), అలీ(14) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో ఆశీశ్(4), సాహిల్(2) మెరిసారు. ఇక బెంగాల్ జట్టులో రైడర్లు దేవాంక్(16), మన్‌ప్రీత్(10) మాత్రమే రాణించగా.. ట్యాకిల్స్‌లో బెంగాల్ నిరాశపరిచింది. యు ముంబతో ఏకపక్షంగా జరిగిన మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 40-22పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ప్రొ కబడ్డీలో నేడు...
పుణేరి పల్టన్స్ × హర్యానా స్టీలర్స్(రాత్రి 8.00గంIIలకు)
తెలుగు టైటాన్స్ × తమిళ్ తలైవాస్(రాత్రి 9.00గంIIలకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68